




https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY

సంపుటి 10 | సంచిక 335 | కర్నూలు | ఆదివారం జనవరి 04 2026 | పేజీలు : 08 | వెల రూ. 5.00








Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi


# పెట్టుబడుల ఊపు కొత్త సంవత్సరానికి బలం

**స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఫలితాలు సుస్పష్టం**

**ముఖ్యమంత్రి చంద్రబాబు**



అమరావతి,జనవరి3(శ్రీచక్ర) : ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల ఊపు కొత్త సంవత్సరానికి బలమైన ఆరంభమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఫలితాలు సుస్పష్టమని పేర్కొన్నారు. పాలసీ సంస్కరణలతో పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరిగిందని తెలిపారు. దేశీయ పెట్టుబడుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రథమ స్థానంలో నిలవడం ప్రజలకు శుభవార్త అన్న ఆయన.. ముందుచూపుతో అమలు చేస్తున్న పాలసీ సంస్కరణల ప్రభావం ఇదని వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కార్యక్రమాల ద్వారా పెట్టుబడిదారులకు వేగవంతమైన సేవలు అందుతున్నాయన్నారు. ప్రోత్సాహకాల పంపిణీలో పారదర్శకత కోసం ఎస్క్రో ఆధారిత వ్యవస్థను ప్రవేశపెట్టామని వెల్లడించారు. రంగాల వారీగా స్పష్టమైన విధానాలు అమల్లోకి తీసుకొచ్చామన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల గమ్యస్థానంగా ఎంచుకున్న ఇన్వెస్టర్లకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. విజన్‌పై నమ్మకం ఉంచినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ బృందం చేసిన కృషి ప్రశంస నీయమన్నారు. ఇది విజయానికి ముగింపుగా కాకుండా.. భవిష్యత్ అభివృద్ధికి పునాదిగా అభివర్ణిద్దామని పిలుపునిచ్చారు. పెట్టుబడులు, భాగస్వామ్యాలు, స్థిరమైన వృద్ధిపై ప్రభుత్వం మరింత దృష్టి పెట్టిందని వెల్లడించారు.

# వైసీపీ హయాంలో డ్రగ్స్‌కి క్యాపిటల్‌గా ఏపీ

**దేశంలో ఎక్కడ డ్రగ్స్ దొరికినా మూలాలు ఇక్కడే**

**కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు**



శ్రీకాకుళం,జనవరి3(శ్రీచక్ర) : వైసీపీ హయాంలో ఏపీ డ్రగ్స్‌కి క్యాపిటల్‌గా ఉండేదని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ హయాంలో గిరిజనులను బలిపశువులను చేశారని ధ్వజమెత్తారు. దేశంలో ఎక్కడ డ్రగ్స్ దొరికినా దాని మూలాలు ఏపీలో ఉండేవని విమర్శలు చేశారు. ఆ పరిస్థితి మారాలని ఈ మహమ్మారిపై యుద్ధం చేస్తున్నామని వ్యాఖ్యానించారు. ఇవాళ(శనివారం) శ్రీకాకుళం ఇచ్ఛాపురంలో అభ్యుదయ సైకిల్ యాత్ర ముగింపు సభ జరిగింది. ఈ సభకు హోంమంత్రి అనిత, రామ్మోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు రామ్మోహన్ నాయుడు. ఏపీని ప్రపంచంలో మొదటి స్థానంలో ఉంచడానికి చంద్రబాబు డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నారని చెప్పుకొచ్చారు. ఈ కృషిలో ఆంధ్రప్రదేశ్ పోలీసుల పని తీరు వర్ణించలేనిదని కొనియాడారు. గతంలో పోలీసులను రాజకీయ వేధింపులకు వాడుకునే వారని విమర్శించారు. ఇప్పుడు తమ ప్రభుత్వంలో పోలీసులకు శిక్షించడం మాత్రమే కాదని.. శిక్షణ ఇవ్వడం కూడా తెలుసు అనేలా పనిచేస్తున్నారని ప్రశంసించారు. ఒకప్పుడు పంజాబ్ వ్యవసాయానికి ప్రసిద్ధిగా ఉండేదని ప్రస్తావించారు. ఇప్పుడు పంజాబ్‌లో అడుగడుగునా డ్రగ్స్ వాడకం పెరిగిపోయిందని విమర్శించారు. పంజాబ్ రాష్ట్రం పూర్తిగా నాశనం అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంజాబ్‌లా ఏపీ మారకూడదనే తాము కంకణం కట్టుకున్నామని చెప్పుకొచ్చారు రామ్మోహన్ నాయుడు. గతంలో నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రలో మన తల్లుల ఆవేదన చూశామని అన్నారు. తమకేం వద్దని.. రాష్ట్రంలో డ్రగ్స్ లేకుండా చేస్తే చాలని మన తల్లులు లోకేశ్‌ని కోరారని తెలిపారు. ప్రతీ ఇంట్లో డ్రగ్స్‌కి వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మన ఇంట్లోనే కాదని.. పక్క ఇంట్లో కూడా ఎవరైనా డ్రగ్స్ వాడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పిల్లలు ఒకరిని చూసి ఇంకొకరు నేర్చుకుంటారని అన్నారు. డ్రగ్స్ వాడకం కూడా అలాగే ఉంటుందని చెప్పుకొచ్చారు. సిగరెట్, డ్రగ్స్ వాడకం స్టైల్ కాదని.. నిజాయితీగా ఉండటం మాత్రమే అసలు సిసలైన్ స్టైల్ అని పేర్కొన్నారు. 'డ్రగ్స్ వద్దు బ్రో' అనేది పిల్లల నినాదం కావాలని సూచించారు. శ్రీకాకుళం అంటే లేబర్ ప్రాంతం కాకూడదని తెలిపారు రామ్మోహన్ నాయుడు. శ్రీకాకుళం అభివృద్ధికి అడ్డా కావాలని సూచించారు. శ్రీకాకుళం జిల్లాపై సీఎం చంద్రబాబు ప్రత్యేక ఫోకస్ పెట్టారని పేర్కొన్నారు. కేందప్రభుత్వం కూడా శ్రీకాకుళం అభివృద్ధికి సహాయం చేస్తోందని వెల్లడించారు. డ్రోన్స్ సాయంతో డ్రగ్స్ పంటలను గుర్తించామని తెలిపారు. డ్రగ్స్‌కి బదులు ఇప్పుడు మంచి పంటలు పండిస్తున్నామని వివరించారు. ఇచ్ఛాపురంలో చాలా కార్యక్రమాలు చేశామని తెలిపారు. ఇప్పుడు అభ్యుదయ సైకిల్ యాత్ర ముగింపు యాత్ర నిర్వహించామని.. ఈ ముగింపు యాత్రను పోలీసులు చాలా గొప్పగా ఏర్పాటు చేశారని రామ్మోహన్ నాయుడు ప్రశంసించారు.

# అన్నమయ్య జిల్లా కేంద్రం మార్పుపై హైకోర్టులో పిల్

అమరావతి:(శ్రీచక్ర) అన్నమయ్య జిల్లా పరిపాలనా కేంద్రాన్ని రాయచోటి నుంచి మదనపల్లెకు మార్చడాన్ని సవాల్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (ఖఎఒ) దాఖలైంది. ఈ మార్పు వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందని పేర్కొంటూ న్యాయవాది బి. వెంకటనారాయణ రెడ్డి ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు.జిల్లా కేంద్రం మార్పు చేస్తూ రెవెన్యూ శాఖ గత ఏడాది డిసెంబర్ 30న జారీ చేసిన జీఓతో పాటు గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని పిటిషన్‌లో కోరారు. జిల్లా కేంద్రాన్ని మార్చే విషయంలో ఏపీ డిస్ట్రిక్ ఫార్మేషన్ యాక్ట్?1974లోని సెక్షన్ 3(5) ప్రకారం ముందుగా ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉన్నప్పటికీ, అలా చేయలేదని పిటిషనర్ పేర్కొన్నారు.అలాగే ప్రజలు, ఇతర భాగస్వామ్య పక్షాల నుంచి ఎలాంటి అభ్యంతరాలు లేదా సూచనలు కూడా స్వీకరించలేదని పిటిషన్‌లో వివరించారు. 2022లో జారీ చేసిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా అన్నమయ్య జిల్లా పరిపాలనా కేంద్రంగా రాయచోటినే కొనసాగించాలని కోర్టును కోరారు. తాజాగా రెవెన్యూ శాఖ జారీ చేసిన జీఓ, గెజిట్ నోటిఫికేషన్‌పై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కూడా పిటిషన్‌లో అభ్యర్థించారు. ఈ కేసులో రెవెన్యూ శాఖ, సాధారణ పరిపాలనా శాఖ ముఖ్యకార్యదర్శులు, భూ పరిపాలనా శాఖ ప్రధాన కమిషనర్‌తో పాటు అన్నమయ్య జిల్లా కలెక్టర్‌ను ప్రతివాదులుగా పిటిషనర్ చేర్చారు.




# కొండగట్టు అంజన్న..నా ప్రాణదాత

**స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు**

**అపలు అభివృద్ధ ఇపనులకు పవన్ కళ్యాణ్ శంకుస్థాపన**





జగిత్యాల,జనవరి3(శ్రీచక్ర) కొండగట్టు అంజన్న దయ వల్లనే తాను ప్రాణాలతో బయటపడ్డానని, ఆయనంటే తనకు ఎన్నలేని భక్తి విశ్వాసాలని ఏపీ ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అన్నారు. జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామిని శనివారం పవన్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. రూ.35.19 కోట్ల తితిదే నిధులతో భక్తుల వసతి కోసం 96 గదుల ధర్మశాల, దీక్ష విరమణ మండప నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడారు. అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నామంటే దేవుడి దయ ఉండాలి. కొండగట్టు నాకు పునర్జన్మనిచ్చింది. గతంలో జరిగిన విద్యుత్ ప్రమాదం నుంచి నేను ఎలా బయటపడ్డానో ఇప్పటికీ ఆశ్చర్యం కలిగిస్తోంది. కొండగట్టు అంజన్నే నన్ను కాపాడారు. దీక్ష విరమణకు మండపం, సత్రం కావాలని గతంలో నన్ను కోరారు. తితిదే సభ్యులు, తెలంగాణ నాయకులు అందరి సమష్టి కృషితోనే ఇది సాధ్యమైంది' అని అన్నారు. కార్యక్రమంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి కేసుల్లో దొరికితే కఠిన శిక్షలు

**హోంమంత్రి వంగలపూడి అనిత హెచ్చరిక**

శ్రీకాకుళం,జనవరి3((శ్రీచక్ర) గంజాయి కేసుల్లో దొరికితే శిక్షలు కఠినంగా ఉంటాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత హెచ్చరించారు. చిన్న చిన్న సరదాలకు పిల్లల జీవితాన్ని పాడు చేసుకోవద్దని సూచించారు. శనివారం శ్రీకాకుళంలోని ఇచ్ఛాపురంలో అభ్యుదయ సైకిల్ యాత్ర ముగింపు సభ జరిగింది. ఈ సభకు హోంమంత్రి అనిత, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడారు. 501 గ్రామాలు, సుమారు 1300 కిలోమీటర్ల మేర పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు అభ్యుదయ సైకిల్ యాత్ర జరిగిందని తెలిపారు. ఇటీవల ఇండిగో సంక్షోభాన్ని హ్యాండిల్ చేయలేదని రామ్మోహన్ నాయుడుపై ఆరోపణలు వచ్చాయని ప్రస్తావించారు. కానీ వారం రోజుల్లో ఆయన పరిస్థితిని పరిష్కరించారని చెప్పుకొచ్చారు. ఆ వారం రోజులు ఆయన పడిన కష్టం తనకు తెలుసునని అన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు పోలీసులు చేసిన కృషి అంతా ఇంతా కాదని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక డ్రగ్స్ నిర్మూలనపై మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు ఇచ్చారని గుర్తుచేశారు. దాని కోసం ఈగల్ అని ఒక ప్రత్యేక డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేశామని వెల్లడించారు హోంమంత్రి అనిత. జీరో నుంచి మొదలు పెట్టి గంజాయి నిర్మూలన చేశామని తెలిపారు. ఇబ్బందిగా ఉంటుందని తెలిసినా చెప్పడం రాదని అన్నారు. నో చెప్పడం మొదలు పెడితే మార్పు కనిపిస్తుందని చెప్పుకొచ్చారు. ఏపీలో అడుగడుగునా గంజాయి తనిఖీలు జరిగాయని తెలిపారు. తాము పని చేస్తే సరిపోదని.. పిల్లల్లో కూడా అవగాహన రావాలని అన్నారు. పిల్లలు వారి భవిష్యత్‌ని సన్మార్గంలో పెట్టుకోవాలని కోరారు. ఎవరి భవిష్యత్ వారి చేతుల్లోనే ఉంటుందని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

# సిఎం చంద్రబాబు దార్శనికతే పెట్టని కోట

**పెట్టుబడుల్లో ఏపికి అగ్రస్థానంపై ఆనందం**

**హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్య**




అమరావతి,జనవరి3(శ్రీచక్ర) పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్‌గా నిలవడంపై ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతకు, మంత్రి నారా లోకేశ్ నిబద్ధతకు నిదర్శనంగా.. పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోనే ఏపీ నెంబర్ వన్‌గా నిలిచిందని వ్యాఖ్యానించారు. బ్యాంక్ ఆఫ్ బరోడా ? అఓఎఇ విడుదల చేసిన నివేదిక ప్రకారం 25.3 శాతం వాటాతో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలవడం మనందరికీ గర్వకారణమని పేర్కొన్నారు హోంమంత్రి అనిత. 2025 ఏప్రిల్ -డిసెంబర్ మధ్య రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడుల వాటా గణాంకాలు రాష్ట్ర పారిశ్రామిక వృద్ధిని స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయని చెప్పుకొచ్చారు. జగన్ హయాంలో వేధింపులు, కక్ష సాధింపులతో పతనావస్థకు చేరిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఏపీ పారిశ్రామిక అభివృద్ధి పరంగా ముందుకు దూసుకెళ్తుందని వెల్లడించారు హోంమంత్రి అనిత. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, సింగిల్ విండో సిస్టమ్ వంటి సంస్కరణల ద్వారా పెట్టుబడిదారుల్లో పెరిగిన నమ్మకమే రాష్ట్రాన్ని టాప్ ప్లేస్‌కు చేర్చడంలో కీలకంగా నిలిచిందని వివరించారు.

# అమరావతిలో మంత్రులు, ఐఏఎస్, జడ్జిల నివాసాలు

**పూర్తి కావచ్చాయని ప్రకటించిన మంత్రి నారాయణ**

అమరావతి,జనవరి3 (శ్రీచక్ర) అమరావతి క్యాపిటల్ సిటీలో నిర్మిస్తున్న రాష్ట్ర మంత్రులు, ఐఏఎస్ అధికారులు, జడ్జిల నివాస భవనాలపై మంత్రి నారాయణ కీలక ప్రకటన చేశారు. నివాస భవనాల పనులు ఈ ఏప్రిల్‌లో పూర్తి చేసి హ్యాండ్ ఓవర్ చేయనున్నట్లు తెలిపారు. అమరావతిలో మొత్తం 4,026 భవనాలు, ప్లాట్లు నిర్మించబడుతున్నాయని చెప్పారు. వీటిలో 186 బంగ్లాలు ఉండగా, మిగతా 3,850 భవనాలు అపార్ట్‌మెంట్ మోడల్లో నిర్మాణం జరుగుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా రావడం వల్ల కొన్ని పనులు ఆలస్యం అయ్యాయని, అయితే ఇప్పుడు అన్ని నిర్మాణాలను పూర్తి చేయడానికి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. మంత్రుల బంగ్లాలు చాలా వరకు పూర్తయ్యాయన్నారు. జడ్జీల బంగ్లాల్లో బ్రిక్ వర్క్, ప్లాస్టింగ్ తుద దశకు చేరిందని.. అఖిల భారత సర్వీసు అధికారుల టవర్స్ కూడా తుది దశకు చేరాయని చెప్పారు. 500 నివాస సముదాయాలను మినహా, మిగతా భవనాలు మార్చి ముగింపు వరకు పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అన్ని భవనాలు పూర్తైన తర్వాత జీఏడీకి హ్యాండ్ ఓవర్ చేస్తామని.. వారు కేటాయిస్తారని మంత్రి తెలిపారు.



# సంపాదకీయం

## పులులతోనే అడవులకు మనుగడ !

పర్యావరణానికి పులలకు అవినాభావ సంబంధం ఉంది. అడవులను రక్షించుకోవాలంటే జంతువుల మనుగడ సాగాలి. జంతువులను కాపాడుకుంటేనే అడవులు పచ్చగా ఉంటాయి. ప్రకృతిని విధ్వంసం చేస్తున్న ప్రజలు అడవులను, కొండలను ధ్వంసం చేయడంతో అక్కడక్కడా ఉన్న పులులు నగరాల మీదకు వస్తున్నాయి. వాటిని చూసి వామ్మో పులి అంటూ పరుగెడుతున్నాయి. అడవులు చక్కగా ఉన్నంత కాలం అవి అక్కడే మనగుడ సాగించాయి. ఒక్క పులులే కాదు. సమస్య జంతుజాలంనకు అడవులే ఆవాసం. వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిది. అవి ఉంటేనే అడవులు, ప్రకృతి పచ్చగా ఉంటాయి. అలాంటి అడవులను యథేచ్ఛగా నరికేస్తున్నాం. కొండలను ధ్వంసం చేస్తున్నాం. దీంతో పులులు, చిరుతలు అడపాదడపా అడవుల శివారు గ్రామాల్లోకి వస్తున్నాయి. ఆహారం, నీరు కోసం తంటాలు పడుతున్నాయి. ఇప్పటికే కోతులు మనుషలను మించి గ్రామాల్లో సంచరిస్తున్నాయి. వీటిని తరిమికొట్టే చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఇవి ప్రజల ఆస్తులను, పంటలను ధ్వంసం చేస్తున్నాయి. మనుషులపై పడి కరుస్తున్నాయి. ఇకపోతే తెలుగు రాష్ట్రాల్లో ఈ మధ్య పులుల, చిరుతల సంచారం అడపదడపా కనిపిస్తోంది. నల్లమల, తిరుమల కొండలతో పాటు తెలంగాణ జిల్లాల్లోని అటవీ ప్రాంతంలో వీటి సంచారాం పెరిగింది. అటవీ అధికారుల లెక్కల ప్రకారం ఉభయ రాష్ట్రాల్లో పులుల సంచారం ఎక్కువైంది. ఓ వైపు మహారాష్ట్రలోని తాడోబా నుంచి, మరో వైపు నల్లమల నుంచి టైగర్లు కొత్త ఆవాసాలను వెతుక్కుంటూ సరిహద్దుల్లోని పలు జిల్లాల్లో తిరుగుతున్నాయి. తాడోబాలో పులుల సంతతి పెరిగిపోవడం.. అంతర్గత సంఘర్షణల వల్లే పులులు గోదావరి దాటి ఆసిఫాబాద్ జిల్లాలోకి అడుగుపెడుతున్నాయని, అక్కడి నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ మీదుగా జిల్లాల్లోకి ప్రవేశిస్తున్నాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. మహారాష్ట్ర లేదా ఛత్తీస్‌గఢ్ నుంచి ఓ పులి గోదావరి దాటి వచ్చినట్టు అనుమానిస్తున్నారు. పులుల సంచారం పెరగడంతో వీటు అప్రమత్తం అయ్యారు. స్థానికులు, వేటగాళ్ల నుంచి ముప్పు పొంచి ఉండడంతో ప్రత్యేక బృందాల ద్వారా గస్తీ కాస్తున్నారు. సోమశిల పరిధిలో ఓ పులి సంచారంతో యంగంపల్లితండా దాని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు. నాగార్జునసాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ వైపు నుంచి కృష్ణా నదిని ఈదుకుంటూ వచ్చిన ఓ పెద్దపులి తమ ప్రాంతంలో సంచరిస్తోందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గ్రామస్తుల సమాచారంతో అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టగా.. వ్యవసాయ పొలాల్లో పులి పాదముద్రలు కనిపించాయి. ఇకపోతే ఇటీవల గుర్తు తెలియని వాహనం ఢీకొని ప్రకాశం జిల్లాలో ఓ పులి మృత్యువాత పడింది. సాధారణంగా వేసవి కాలంలో పులులు రిజర్వ్ ఫారెస్ట్ వైపు నుంచి అమ్రాబాద్ వైపు సంగమేశ్వర ప్రాంతం గుండా నదిని దాటుతుంటాయి. రెండు రాష్ట్రాల సరిహద్దులు దగ్గరగా ఉండటం, అక్కడ నీటి లోతు తక్కువగా ఉండడంతో పులులు కొల్లాపూర్ ఫారెస్ట్ లిమిట్స్‌లోని మార్గాన్ని ఎంచుకుంటాయని అధికారులు చెబుతున్నారు. గతంలో మహారాష్ట్ర నుంచి వచ్చే ఒకటో రెండో పులులను కాపాడేందుకే అష్టకష్టాలు పడ్డ ఫారెస్ట్ ఆఫీసర్లకు ఇప్పుడు పెద్దసంఖ్యలో వస్తున్న పులులను రక్షించడం పెను సవాల్‌గా మారింది. టైగర్ కారిడార్‌లోని అడవుల్లో ఇటీవలి కాలంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి పులులను ట్రాక్ చేస్తున్నారు. వాటి కదలికలను నిత్యం గమనించేందుకు టైగర్ ట్రాకర్లను సైతం నియమించారు. అధికారులు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా వేటగాళ్ల రూపంలో పెద్దపులులు ప్రాణాలు కోల్పోతున్నాయి. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో 36 నుంచి 45 వరకు పులులు ఉన్నాయని చెబుతున్నారు. పులులు నంచరిస్తున్న అటవీ ప్రాంతాల్లో ఎలాంటి ఉచ్చులు బిగించకూడదని, పులి కదలికలు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. మహారాష్ట్రలోని తాడోబా టైగర్ రిజర్వ్ నుంచి పులులు తెలంగాణ వైపు క్యూ కడుతున్నాయి. అక్కడి టైగర్ రిజర్వ్‌లో పులుల సంఖ్య గణనీయంగా పెరిగిపోవడంతో కొత్త ఆవాసాలను వెతుక్కుంటూ ప్రాణహిత నది దాటి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయి. ఈ సీజన్‌లో తాడోబా నుంచి సుమారు 3-4 పులులు రాష్ట్రంలోకి ప్రవేశించాయని, దీంతో కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ అటవీ ప్రాంతాలు ఇప్పుడు 'టైగర్ జోన్'గా మారిపోయిందని చెప్తున్నారు. కాగా ఈ పులుల్లో కొన్ని వెనక్కి వెళ్లిపోతుండగా, మరికొన్ని తిర్యాణి, పెంచికల్‌పేట రేంజ్‌లలో ఆవాసం కోసం ప్రయత్నిస్తున్నట్లు పేర్కొంటున్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోకి వస్తున్న పులులు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోకి ప్రవేశిస్తున్నాయి. ఇటీవల ఆసిఫాబాద్ నుంచి మొదలైన ఓ టైగర్ జర్నీ మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల మీదుగా సాగి సిద్దిపేట జిల్లాలోకి చేరింది. తొగుట, మిరుదొడ్డి, కొండాపూర్ మండలాల్లో పులి పాదముద్రలు కనిపించాయని, సిద్దిపేట పట్టణానికి దగ్గరగా కూడా వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. సిద్దిపేట జిల్లాలో పులి కనిపించడం ఇదే తొలిసారి. కొత్త ఆవాసం కోసమో.. తోడు కోసమో ఈ పులి దాదాపు 300 కిలోమీటర్లకుపైగా నడిచి ఉంటుందని ఆఫీసర్లు భావిస్తున్నారు. ఈ పులి రాష్ట్రంలోని 14 జిల్లాలో సంచరిస్తున్నట్లు గుర్తించారు. తాజాగా భూపాలపల్లి జిల్లాలోనూ పులి సంచారం కలవరపెడుతోంది. ఇటీవల భూపాలపల్లి అడవి నుంచి జకారం వద్ద రోడ్డు దాటుతుండగా ఓ అంబులెన్స్ డ్రైవర్ చూసినట్టు స్థానికులు చెబుతున్నారు.

# అన్నదాతకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

**రైతు శ్రేయస్సే తమ ప్రభుత్వ ధ్యేయం**

**×కర్నూలు, కడప జిల్లాలకు చెందిన 37,752 మంది రైతులకు 50,000 చొప్పున రూ.128.33 కోట్లు రూపాయలు నేరుగా రైతుల ఖాతాల్లో జమ**

**×కర్నూలు జిల్లాలోనే 31,352 మంది రైతులకు రూ.99.92 కోట్లు జమ**

**×రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖ మంత్రి వర్యులు కింజరాపు అచ్చెన్నాయుడు**









కర్నూలు, జనవరి 03 (శ్రీచక్ర): రైతు శ్రేయస్సే తమ ప్రభుత్వ ధ్యేయం అని, రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అన్నదాతకు అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖ మంత్రి వర్యులు కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. కోడుమూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఉల్లి పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు పరిహారం అందించే కార్యక్రమంలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, టి.జి.భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ జిల్లాలో అకాల వర్షాలు రావడం వల్ల రైతులు తీవ్రమైన పంట నష్టం, ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు.. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతుల సంక్షేమం, వారిని ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యంగా రైతుల కష్టాలను తీర్చడానికి ప్రభుత్వం సుమారు రూ.130 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.. ఉల్లి రైతులకు హెక్టారుకు రూ. 50,000 ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం జరిగిందని, చెప్పిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏ మాత్రం ఆలోచించకుండా వెంటనే దాదాపు రూ. 130 కోట్లు మంజూరు చేశారన్నారు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్నపూర్ణ అని, రాష్ట్ర అభివృద్ధికి నీటి పారుదల, వ్యవసాయ రంగాలు అత్యంత కీలకమన్నారు.. 2014-2019 కాలంలో వ్యవసాయ, ఇరిగేషన్ రంగాలకు "స్వర్ణ యుగం"గా మంత్రి అభివర్ణించారు.. ఆ సమయంలో దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కేవలం ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసమే రూ. 50 వేల కోట్ల ఖర్చు చేసి శరవేగంతో ముందుకు తీసుకొని వెళ్లడం జరిగిందన్నారు..వ్యవసాయ రంగం లో 7-8 % ఉన్న జిడిపి ని 17 శాతం వరకు తీసుకొని వెళ్లి దేశంలోనే వ్యవసాయ రంగం అగ్రగామిగా నిలిచిందన్నారు.. 2019 తర్వాత వచ్చిన ప్రభుత్వం ఈ రెండు ముఖ్యమైన శాఖలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వం ఐదు సంవత్సరాలలో ఇరిగేషన్ రంగానికి ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదన్నారు.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఈ నాలుగు సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రతి ఒక్క ఎకరాకు నీరిచ్చే విధంగా ఇరిగేషన్ రంగాన్ని ముందుకు తీసుకెళ్తాం అన్నారు.. ఎవరూ ఊహించని విధంగా బంపర్ క్రాప్ (అధిక దిగుబడి) వచ్చినందుకు వ్యవసాయ శాఖ మంత్రిగా తాను చాలా సంతోషిస్తున్నానన్నారు. కానీ పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లేక రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. తాను వ్యవసాయ శాఖ మంత్రిగా బాధ్యత తీసుకున్న తర్వాత మొట్టమొదటిగా మిరప పంటకు ధర పడిపోయిందని, కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకుని 'మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్' ఏర్పాటు చేసి, మార్కెట్‌ను స్థిరీకరించి మిర్చి రైతులను ఆదుకున్న ప్రభుత్వం తమది అని మంత్రి పేర్కొన్నారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఏదైతే కోకో పంట అని ధర పడిపోతే, కేజీ కి రూ.50 రాష్ట్ర ప్రభుత్వమే ఇచ్చి కోకో రైతులకు రూ.15 నుండి 20 కోట్ల దాకా ఖర్చు చేశామన్నారు. అదే విధంగా ప్రకాశం జిల్లాలో పొగాకు రైతుల కోసం రూ. 12 వేల గిట్టుబాటు ధర కల్పించి, రూ.300 కోట్లు ఖర్చు చేశామన్నారు. చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు 12 రూపాయల ధరను నిర్ణయించి, అందులో 4 రూపాయలు ప్రభుత్వం భరిస్తుందని, మిగిలిన 8 రూపాయలు పరిశ్రమల వారు చెల్లించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, చెప్పినట్లుగానే ప్రభుత్వం 4 రూపాయలను నేరుగా రైతుల ఖాతాల్లో చేసిందన్నారు..ఉల్లి రైతుల విషయానికి వస్తే, కేంద్ర ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యం అని ప్రకటించినప్పుడు హెక్టారుకు 17,500 రూపాయలు ప్రభుత్వం ఇస్తారని, కానీ మన ముఖ్యమంత్రి మరో అడుగు ముందుకేసి దానికి 7,500 రూపాయలు కలిపి మొత్తం 25,000 రూపాయలు హెక్టారుకు ఉల్లి రైతులకు అందించారన్నారు.. కానీ ఈ ఏడాది కర్నూలు జిల్లాలో అనుకోని ప్రకృతి వైపరీత్యం వల్ల రైతులు పెట్టుబడి పెట్టి చాలా నష్టపోయారన్నారు. కిలో ఉల్లిపాయలను 12 రూపాయల చొప్పున కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నాం అన్నారు. అప్పటికే భారీ వర్షాలు కురుస్తున్నాయి, పంట పాడైపోతుందన్న ఆందోళనతో, రైతులు అపరిపక్వంగా ఉన్న ఉల్లిని కూడా మార్కెట్‌కు తీసుకురావడం ప్రారంభించారని, ఇది కేవలం రబీ సీజన్‌తో ముగిసే సమస్య కాదని, ఖరీఫ్ సీజన్ ప్రారంభమైతే పరిస్థితి మరింత కష్టతరంగా మారుతుందని, సరైన ప్రణాళిక లేకపోతే రైతులు భారీగా నష్టపోతారని సమస్యను ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకొని వెళ్లగా ఆయన వెంటనే స్పందిస్తూ, 'మనకు రైతులే ప్రాధాన్యత' అని చెప్పారు. ఇప్పటివరకు హెక్టారుకు 25,000 రూపాయల పరిహారం ఇచ్చేవాళ్లం, కానీ ఇప్పుడు ఒక చరిత్ర సృష్టించబోతున్నాం?మరో 25,000 కలిపి, హెక్టారుకు మొత్తం 50,000 రూపాయలను ఉల్లి రైతులకు అందిస్తున్నాం అని ముఖ్యమంత్రి చెప్పారన్నారు. చెప్పినట్లుగా ఈ రోజు 130 కోట్ల రూపాయలను నేరుగా మీ ఖాతాల్లో జమ చేస్తున్నాం అన్నారు..గత ప్రభుత్వం వ్యవసాయ, అనుబంధ రంగాలకు సంబంధించి ఏ కార్యక్రమం చేపట్టలేదని, తమ ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ, డ్రిప్ ఇరిగేషన్ లాంటి కార్యక్రమాలు చేశామన్నారు. గత ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ కింద 2,200 కోట్లు బడ్జెట్ కేటాయించి, 5 సంవత్సరాల్లో కేవలం 1400 కోట్ల రూపాయలు ఖర్చు చేసిందన్నారు. మన ప్రభుత్వంలో 2025-26లో ఎప్పుడైనా ధరలు తగ్గిపోతే ప్రభుత్వం కొనుగోలు చేయాలని బడ్జెట్‌లో 300 కోట్ల రూపాయలు పెట్టామని, కానీ 300 కోట్ల రూపాయలు ఖర్చు చేసి పొగాకు కొన్నామని, మామిడికి 270 కోట్లు ఇచ్చామని, ఈ రోజు ఉల్లి పంట నష్టానికి 130 కోట్లు ఇచ్చామన్నారు. ఎక్కడ ఏ పంటకు నష్టం వచ్చినా, రైతులకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకున్నామన్నారు. గత ప్రభుత్వం 5 ఏళ్ళలో 1400 కోట్లు ఖర్చు పెడితే చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో 18 మాసాల్లో 1170 కోట్లు మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ కింద ఖర్చు పెట్టి, నేరుగా రైతుల అకౌంట్లలో వేశామన్నారు.. అన్నదాత సుఖీభవ కింద రెండు విడతలుగా 14000 ఇచ్చాం, ఫిబ్రవరిలో 6000 ఇచ్చి, ఇచ్చిన మాట ప్రకారం 20000 రూపాయలు ఇస్తున్నామన్నారు. గతంలో కంటే పెన్షన్లను గణనీయంగా పెంచామని, కేవలం 18 నెలల కాలంలోనే పెన్షన్ల కోసం సుమారు 50,000 కోట్ల రూపాయలను నేరుగా ప్రజలకు అందించినట్లు తెలిపారు.. మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని, 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రైతులకు 20,000 రూపాయలు అందిస్తున్నామని, 'స్త్రీ శక్తి' పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నామని, ఇచ్చిన హామీ ప్రతి ఒక్కటి నెరవేరుస్తున్నట్లు మంత్రి తెలిపారు.మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలను నెరవేరుస్తూ, అభివృద్ధి లో భాగంగా ఇరిగేషన్ కి ఈ 18 నెలల్లోనే 12 వేల కోట్లు చేశామని, హంద్రీ-నీవా పూర్తి చేసామన్నారు..ప్రధాన మంత్రి సుజల పథకం కింద గత ప్రభుత్వం ఒక్క పైసా వాడుకోకుండా, పథకం ముగిసిపోతుంటే, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆ పథకాన్ని పొడిగించేలా కృషి చేశారన్నారు. 2028 నాటికి ఇచ్చిన మాట ప్రకారం, మేనిఫెస్టోలో పెట్టిన ప్రకారం, ఈ రాష్ట్రంలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు ఇచ్చే బాధ్యతని మన రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్టీ రామారావు గారు తెలుగుదేశం పార్టీని స్థాపించిన తర్వాత, ఉమ్మడి రాష్ట్రంలో, విభజన తర్వాత మొత్తం 12 సార్లు ఉపాధ్యాయ నియామకాలు జరిగితే, అందులో 9 సార్లు ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు హయాంలోనే జరిగాయన్నారు.. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ఎటువంటి సమస్యలు లేకుండా 17,000 మంది టీచర్ పోస్టులను భర్తీ చేసి పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించామన్నారు. అదే విధంగా 6,000 మంది పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలను ఇచ్చామని, ఇప్పుడు మళ్ళీ గ్రూప్-2 పోస్టుల నియామకాలు చేపడుతున్నామన్నారు. ప్రైవేట్ ఉద్యోగాలు కూడా రావాలి అంటే రాష్ట్రానికి భారీ పరిశ్రమలు రావాలన్నారు.. 2024లో మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిశ్రమలకు మన మీద నమ్మకం కలిగి ఉ ందన్నారు.. ఒక సర్వే లో ఇచ్చిన ప్రకారం ఫోర్బ్స్ (ఈనీతీఎవబ) అనే అమెరికా పఅంతర్జాతీయ పత్రిక లో ఏ రాష్ట్రంలో పరిశ్రమ పెడితే ఏ ప్రభుత్వం బాగా సహకరిస్తుంది అనే అంశంలో 25 శాతం పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వచ్చాయి అంటే ఎన్డీయే (ఔఆం) ప్రభుత్వం గొప్పతనం అని మంత్రి తెలిపారు.గత 18 నెలలుగా ఎన్నో సమస్యలు, ఇబ్బందులు ఎదురైనప్పటికీ, ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సమర్థవంతంగా పరిపాలన అందిస్తున్నామని మంత్రి తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రివర్యులు టి.జి.భరత్ మాట్లాడుతూ ఉల్లి పంట నష్ట పోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో సమస్యను వెంటనే ముఖ్యమంత్రి కార్యాలయం (అటూ) దృష్టికి తీసుకొని వెళ్లడం జరిగిందన్నారు.. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి క్వింటాల్‌కు ?1200 మద్దతు ధరను ప్రకటించడం గొప్ప విషయం అన్నారు.. ఇదే విధంగా 2014-19 మధ్య రెండుసార్లు ఇలాంటి కనీస మద్దతు ధర ఇచ్చామని మంత్రి పేర్కొన్నారు. ఆరోగ్యం, వ్యవసాయం, పరిశ్రమలకు ఈ మూడింటికి ప్రాధాన్యం ఇచ్చే ప్రభుత్వం ఎన్డీయే ప్రభుత్వం అన్నారు.. మన ప్రభుత్వం నిరంతరంగా కొనసాగితే ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని, ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంటుందని, అగ్రికల్చర్‌ను (వ్యవసాయాన్ని) మార్చేందుకు ఎంతో అవకాశం ఉంటుందన్నారు.. సేంద్రియ సాగుకు కూడా ప్రభుత్వం చాలా ప్రాధాన్యత ఇస్తోందని, వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు.కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ, ఉల్లి పంటసాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుని, రైతులకు అండగా నిలిచిందన్నారు. కర్నూలు మార్కెట్ యార్డులో నిర్మాణంలో ఉన్న గోడౌన్ ఇప్పటికే 70శాతం వరకు పూర్తయ్యాయని, మిగిలిన 30 శాతం పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. మహారాష్ట్ర నుంచి ఉల్లి విత్తనాలను దిగుమతి చేసి, రైతులకు అధిక దిగుబడి సాధించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు. హంద్రీ నీవా పనులకు సంబంధించి రూ. 210 కోట్లతో ప్రతిపాదనలు పంపామని, తద్వారా 50 వేల ఎకరాలకు ప్రయోజనం కలుగుతుందని ఎంపీ తెలిపారు. అలాగే వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టులను కూడా పూర్తి చేయాలని ఎంపీ కోరారు. మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ప్రధానంగా పండిస్తున్న పంట ఉల్లి పంట అన్నారు..కర్నూలు, కడప జిల్లాల్లో దాదాపు 66,000 ఎకరాల్లో ఉల్లి పంట సాగవుతుండగా, ఒక్క కర్నూలు జిల్లాలోనే 55,000 ఎకరాల్లో ఉల్లి పంట సాగవుతోందన్నారు... ఈ ఖరీఫ్ సీజన్‌లో ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాల వల్ల పంట దాదాపు 14 రోజుల పాటు నీటిలో మునిగిపోయిందని, దీనివల్ల మార్కెట్ ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు వచ్చాయని డైరెక్టర్ పేర్కొన్నారు. రైతుల కష్టాలను గుర్తించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లగా, ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధి (ఖతీతిఇవ రాబిజీఎతిశ్రీతిళిజీబితినీని ఈబీనిట) కింద ?300 కోట్లను కేటాయించిందని తెలిపారు.. ఉ ల్లి రైతులకు ఎకరాకు ?20,000 చొప్పున (హెక్టారుకు ?50,000) ఆర్థిక సాయం అందించి రైతులకు లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. భవిష్యత్తులో మహారాష్ట్రలోని నాసిక్ మార్కెట్‌తో పోటీ పడేందుకు గాను సబ్సిడీ ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించేందుకు ప్లాన్ చేస్తున్నామన్నారు.. పంట మార్పిడి (అతీనీజూ ఆతిలవతీబతిటతిఇజీబితినీని) పద్ధతులను, మెరుగైన వ్యవసాయ ప్రణాళికలను అమలు చేయడం వంటి చర్యలు తీసుకోనున్నట్లు డైరెక్టర్ వివరించారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉల్లి సాగు అత్యధికంగా కర్నూలు జిల్లాలో జరుగుతుందని పేర్కొన్నారు. గత సంవత్సరంలో అధిక వర్షాల కారణంగా నష్టపోయిన ఉల్లి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం జిల్లాకు రూ. 99.92 కోట్ల నిధులు కేటాయించగా, అందులో కోడుమూరు నియోజకవర్గంలో 8890 మంది రైతులకు రూ. 27 కోట్లను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రైతులు ఎక్కడా నష్టపోకుండా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రాబోయే రోజుల్లో కోడుమూరు నియోజకవర్గంలో పంటల నిల్వ కోసం ఆధునిక సౌకర్యాలతో కూడిన ఏసీ గోదాంను ఏర్పాటు చేయాలని, కోడుమూరు పట్టణానికి తాగునీటి సమస్య తీర్చాలని ఎమ్మెల్యే కోరారు. కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రైతులు తీసుకున్న దీర్ఘకాలిక రుణాలు, చక్రవడ్డీ భారాన్ని తగ్గించేందుకు వన్‌టైమ్ సెటిల్మెంట్ (ఌూ) విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదించడం జరిగిందన్నారు. కోడుమూరు నియోజకవర్గంలో త్రాగునీటి సమస్య తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని, గాజుల దిన్నె ప్రాజెక్ట్ ఎత్తు తగ్గించాలని కోరారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ, రైతే రాష్ట్రానికి వెన్నెముక అని, రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని పేర్కొన్నారు. అభివృద్ధి,సంక్షేమం రెండింటినీ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పాణ్యం నియోజకవర్గంలో 2,526 మంది రైతులకు 4,253 ఎకరాలకు గాను రూ.8.43 కోట్ల పరిహారం ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ కార్యక్రమం ద్వారా ప్రతి రైతుకు రూ.20,000 ఆర్థిక సహాయం అందిస్తోందని ఆమె పేర్కొన్నారు. పాణ్యం నియోజకవర్గంలో సాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని, గోరుకల్లు రిజర్వాయరు కు రూ.53 కోట్లు, అలగనూరు రిజర్వాయర్ కు రూ.36 కోట్లు మంజూరు చేస్తోందని తెలిపారు. అలాగే సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్‌గా నిలిచాయని ఎమ్మెల్యే తెలిపారు. పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ. శ్యాంబాబు మాట్లాడుతూ, రైతుల కళ్లలో కనిపించే ఆనందమే తమకు అత్యంత సంతృప్తిని ఇస్తుందని పేర్కొన్నారు. పత్తికొండ నియోజక వర్గంలో కూడా ఉల్లి రైతులు ఎక్కువగా లబ్ధి పొందారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు నేరుగా రైతుల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నాయని, అందువల్ల ప్రభుత్వం చేసిన మేలును ప్రతి ఒక్కరూ తెలుసుకొని, సమాజంలో చర్చించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బి.వి. జయ నాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ, పంట నష్టాల సమయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమం ద్వారా రైతులను ఆర్థికంగా ఆదుకుని భరోసా కల్పించిందని తెలిపారు. గాజులదిన్నె ప్రాజెక్టు ద్వారా ఎమ్మిగనూరు నియోజకవర్గంతో పాటు పత్తికొండ మంత్రాలయం ఆలూరు కోడుమూరు నియోజకవర్గాలకు మేలు జరిగేలా గాజుల దిన్నె ప్రాజెక్ట్ ఎత్తు తగ్గించాలని ఎమ్మెల్యే కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.సిరి, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అవకతవకలకు పాల్పడితే ఇంటికే

## పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వీడండి
## సిబ్బందికి కమిషనర్ పి.విశ్వనాథ్ హితవు
## 3, 5వ శానిటేషన్ డివిజన్లలో అకస్మిక తనిఖీలు
## పలు అక్రమాలు గుర్తింపు..
## సిబ్బందిపై చర్యలకు ఆదేశం






కర్నూలు, జనవరి 3 (శ్రీచక్ర): నగరంలో పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి అవకతవకలు పాల్పడినా సంబంధిత ఉద్యోగి ఇంటికే వెళ్లాల్సి వస్తుందని, శుభ్రత విషయంలో ఎలాంటి అలసత్వాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ స్పష్టం చేశారు. శనివారం తెల్లవారుజామున కమిషనర్ 3, 5వ శానిటేషన్ డివిజన్లలో అకస్మిక తనిఖీలు నిర్వహించి పారిశుద్ధ్య పనుల నిర్వహణను పరిశీలించారు. తనిఖీల్లో పలు అవకతవకలు వెలుగులోకి రావడంతో కమిషనర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గత డిసెంబర్ నెలకు సంబంధించిన హాజరు పట్టికలో వరుసగా 15 రోజులపాటు హాజరు, గైర్హాజరు నమోదు చేయకుండా కేవలం చుక్కలు మాత్రమే పెట్టడంపై కమిషనర్ మండిపడ్డారు. అనారోగ్య కారణాలతో విధులకు రాని కార్మికుల స్థానంలో ఇతరులను నియమించుకునే విషయంలో పర్యవేక్షణ లేకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. "మద్యం సేవించే అలవాటు ఉన్న వ్యక్తులకు కూడా బదులు అవకాశం ఇస్తారా?" అంటూ అధికారులను ప్రశ్నించారు. మౌర్యఇన్ సమీపంలోని మహమ్మదీయ వక్ఫ్ బోర్డు కాంప్లెక్స్ వద్ద ప్రధాన రహదారి గుండా నెలల తరబడి చెత్త పేరుకుపోవడం, డ్రైనేజీ కాలువ పూర్తిగా పూడికతో నిండిపోవడంపై కమిషనర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత షాపుల నిర్వాహకులకు శుభ్రతపై హెచ్చరికలు జారీ చేయడంలో శానిటేషన్ సిబ్బంది అలసత్వం ప్రదర్శించడాన్ని అసహనం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఇద్దరు సానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు శానిటేషన్ కార్యదర్శులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అందరికీ ఉదయం 05:45 కల్లా ఎఫ్ఆర్ఎస్ పూర్తి చేసి విధుల్లోకి వెళ్లాలని చెప్పినా 07:30 వరకు వాహనాలు రహదారులపైకి రాకపోవడం ఏమిటి?" అంటూ కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. తాను ఎవరినీ ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో మాట్లాడటం లేదని, నగరాన్ని శుభ్రంగా ఉంచడమే లక్ష్యంగా క్రమశిక్షణతో పని చేయాలని సూచిస్తున్నట్లు తెలిపారు. తాను కర్నూలులో ఉన్నంతకాలం అవకతవకలు, అక్రమాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావివ్వబోమని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య పనుల్లో దీర్ఘకాలిక సమస్యలు ఉంటే నిర్మాణాలు, ఆక్రమణల తొలగింపుల కోసం ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగాలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.అదేవిధంగా కమిషనర్ ఆదేశాల మేరకు ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ ప్రసాద్ 2వ డివిజన్‌లో హాజరు పట్టికను తనిఖీ చేశారు.తనిఖీల్లో కార్యదర్శి నాగరాజు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు ఎం.శ్రీనివాసులు, నాగేశ్వరరావు, టిఏఈ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కందుల కొనుగోలు సేకరణ కార్యక్రమం విజయవంతం

## డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి




డోన్, జనవరి 3 (శ్రీచక్ర): ప్యాపిలి పట్టణంలో ఎన్సీసీఎఫ్ ఆధ్వర్యంలో ఏ.పీ. మార్క్‌ఫెడ్ నిర్వహించిన కందుల కొనుగోలు సేకరణ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి డోన్ నియోజకవర్గ శాసనసభ్యులు కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి శనివారం ముఖ్య అతిథిగా హాజరై రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడారు. రైతులు పండించిన కందులకు ప్రభుత్వం క్వింటాలుకు రూ. 8,000 మద్దతు ధరను ప్రకటించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడమే ఉద్దేశంగా ఇటువంటి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రైతులు మధ్యవర్తుల చేతిలో నష్టపోకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తమ ఉత్పత్తులను విక్రయించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో కూడా రైతులకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు,కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# ఉల్లి పంట నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం ఊరట,



ఎమ్మిగనూర్,జనవరి3 (శ్రీ చక్ర):-కోడుమూరునియోజకవర్గం లోనిర్వహించిన అన్నదాతలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ? ఉల్లి రైతులకు ఊరట అనే కార్యక్రమంలోభాగంగారాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి కె. అచ్చెన్నాయుడు, రాష్ట్ర మంత్రి టీజీ భరత్ మరియు ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర్ రెడ్డి సమావేశ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ పంట నష్టపోయిన ఉల్లి రైతులకు ఎకరాకు 20వేల రూపాయలు చొప్పున వ్యవసాయ శాఖ మంత్రి నిధులను విడుదల చేశారు.ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని 1287 మంది రైతులకు మూడు కోట్ల 19 లక్షల రూపాయలు ఉల్లి పంట రైతులకు నష్టపరిహారాన్ని అందజేశారు. మరియు రైతులకు అదనంగా పంట నష్టానికి ఇన్‌పుట్ టాప్-అప్ సబ్సిడీగా రెండు కోట్ల 91 లక్ష రూపాయలు మంజూరయ్యాయి అని తెలిపారు. మొత్తం జిల్లాలోని ఉల్లి పంట వేసిన రైతులు అయిన 3422 మంది రైతులకు 4,51 1 ఎకరాల విస్తీర్ణానికి సంబంధించి మొత్తం రైతులకు ఉల్లి పంట నష్టపరిహారం కింద ఆరుకోట్ల 10 లక్షల రూపాయలు పంట నష్ట పరిహారాన్ని అందజేశారు. రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. అన్నదాతలకు ఏ కష్టమొచ్చినా కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలబడుతుందని ఎమ్మెల్యే బీవీ. జయనాగేశ్వర్ రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బి.నాగరాజు,కర్నూలు జిల్లా ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి,వివిధ శాఖల అధికారులు, టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు కృష్ణమ్మ, ప్రజాప్రతినిధులు మరియు రైతులు పాల్గొన్నారు.

# గంగాప్రసాద్ సోదరుడు సత్యనారాయణ మృతికి సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం నివాళి

వరదయ్యపాలెం జనవరి 3(శ్రీ చక్ర) ×ప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ సీనియర్ నేత కే.గంగాప్రసాద్ సోదరుడు కె.సత్యనారాయణ చౌదరి మృతికి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రగాఢ సంతాపంప్రముఖ పారిశ్రామికవేత్త, టీడీపీ సీనియర్ నేత కే.గంగాప్రసాద్ సోదరుడు కె.సత్యనారాయణ చౌదరి మృతికి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నివాళులు అర్పించారు. సమాచారం తెలుసుకున్న వెంటనే ఆయన సూళ్లూరుపేట చేరుకొని మృతుడి భౌతిక కాయానికి పుష్పాంజలి ఘటించి, గంగాప్రసాద్కు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్మ్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ డి. ఇలంగోవన్ రెడ్డి, టీడీపీ నాయకులు పాల్లొన్నారు.



# రహదారి ప్రమాదాల నియంత్రణే లక్ష్యం




కర్నూలు, జనవరి 03 (శ్రీచక్ర): ప్రతి శనివారం రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ , డిఐజి , కర్నూలు ఇన్ చార్జీ ఎస్పీ విక్రాంత్ పాటిల్ లు ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. ఈ సంధర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పోలీసుస్టేషన్ పరిధులలో జిల్లా పోలీసు అధికారులు ప్రజలకు రోడ్డు భద్రత , ట్రాఫిక్ నిబంధనల పై సమావేశాలు నిర్వహించి, అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బైక్ లు నడిపే వారు ఖచ్చితంగా హెల్మెట్లు ధరించే విధంగా , ఓవర్ స్పీడ్ , ఓవర్ లోడ్ తో వాహనాలు వెళ్ళకుండా, డ్రంకెన్ డ్రైవ్ చేయరాదని తదితర రోడ్డు భద్రత ప్రాముఖ్యతల పై ప్రజలకు అవగాహన కల్పించారు.

# రైతులకు ప్రభుత్వ రాజముద్రతో ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే బీవీ,




ఎమ్మిగనూర్, జనవరి, 3 (శ్రీ చక్ర ): గోనెగండ్ల మండల పరిధిలోని కున్నూరు గ్రామంలో రైతులకు ప్రభుత్వ రాజముద్రతో ఉన్న పట్టాదారు పాసు పుస్తకాలను ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ వైసీపీ హయాంలో జగన్ బొమ్మతో భూమి హక్కు పత్రాలు, సర్వే రాళ్ళు ఉండటం, రీ సర్వే కూడా తప్పుల తడకగా ఉండటంతో వైసీపీ ప్రభుత్వం పై రైతులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారని తెలిపారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రీ సర్వే ద్వారా చేసిన తప్పులను సరిదిద్ది ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేస్తామని చంద్రబాబు చెప్పడంతో ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని ఎమ్మెల్యే బీవీ.తెలిపారు.అలాగే రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎల్లవేళలా అహర్నిశలుగా కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ , రెవెన్యూ అధికారులు,ఏఎంసీ చైర్మన్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు, మండల నాయకులు, గ్రామ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

# స్వచ్ఛ సంక్రాంతి కార్యక్రమం నిర్వహణ ద్వారా స్వచ్ఛ కర్నూలు జిల్లా ను సాధించాలి

**జనవరి 1 వ తేదీ నుండి 10 వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ ను చేపట్టాలి :జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**




కర్నూలు , జనవరి 3 (శ్రీచక్ర): స్వచ్ఛ సంక్రాంతి ద్వారా స్వచ్ఛ కర్నూలు జిల్లా గా తీర్చిదిద్దేందుకు జనవరి 1 వ తేదీ నుండి 10 వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ ను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. శనివారం సాయంకాలం కలెక్టరేట్ లో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ద్వారా కర్నూలు జిల్లా లోని 8 మేజర్ పంచాయతీలు-1.కోసిగి 2. కౌతాలం 3. హోలగుంద,4. ఓర్వకల్లు 5. ఆదోని,6. మంత్రాలయము,7. పత్తికొండ,8. కోడుమూరు కేటాయించబడిన 8 ఎలక్ట్రికల్ శానిటేషన్ ఆటోలు పంపిణీ చేశారు. ఆటోలకు జెండా ఊపి , ఆటో లైసెన్స్ లను సంబంధిత పంచాయతీలకు అప్పగించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 10 వ తారీకు వరకు నిర్వహించే ఈ స్పెషల్ డ్రైవ్ లో చెత్త దిబ్బలు తీసివేయుట , ప్లాస్టిక్ వ్యర్ధాలను ట్రాక్టర్ ద్వారా బయటికి తరలించి గ్రామాన్ని శుభ్రపరచడం , డ్రైన్స్ ను శుభ్రపరచుట , ప్రధాన రోడ్ల వెంట చెత్త దిబ్బలు మరియు ప్లాస్టిక్ లేకుండా డోజర్స్ మరియు జెసిబిల ద్వారా శుభ్రము చేయుట , మురుగు నీటి నిల్వ లేకుండా తొలగించడము , బ్లీచింగ్ పౌడర్, సున్నము మరియు ఆయిల్ బాల్స్ ఉపయోగించి గ్రామాన్ని శుభ్రంగా ఉంచడము చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా డి పి ఓ భాస్కర్ మాట్లాడుతూ ఇపుడు వచ్చిన 8 ఎలక్ట్రికల్ ఆటోలు తో పాటు ఇంకా 30 దాకా ఆటోలు జిల్లా కు వస్తాయని తెలిపారు. కర్నూలు జిల్లాలో, 484 గ్రామ పంచాయతీలలో 428 చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు ఇప్పటివరకు నిర్మింపబడ్డాయి మరియు మిగతా 56 షెడ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. ప్రతి రోజు, ఇంటింటి నుండి వ్యర్థాలను" క్లాప్ మిత్ర వారు రవాణా వాహనాల ద్వారా సేకరిస్తున్నారని, క్లాప్ మిత్రలు -1250 షెడ్ మిత్రలు- 350 పంచాయతీ శానిటేషన్ వర్కర్స్ -321 ట్రైసైకిల్స్ -1294 పుషకార్ట్స్- 203 ట్రాక్టర్స్-149 సహకారం తో జిల్లా ను స్వచ్ఛ జిల్లా గా చేసే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశానికి సంబంధిత పంచాయతి సిబ్బంది పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక ప్రవచనాలతోనే యువతకు మార్గదర్శనం:మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్



కర్నూలు , జనవరి 3 (శ్రీచక్ర): నేటి పోటీ ప్రపంచంలో తప్పుదారి పడుతున్నటువంటి యువతను సన్మార్గంలోకి తీసుకురావడానికి ఆధ్యాత్మిక ప్రవచనాలు మార్గదర్శకంగా నిలుస్తాయని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. శనివారం స్థానిక ఎగ్జిబిషన్ గ్రౌండ్ నందు ప్రముఖ ప్రవచనకర్త శ్రీ శ్రీ శ్రీ మద్దిపర్తి పద్మాకర్ గారి 403 వ శ్రీ మద్ భాగవత సప్తాహం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ పిల్లలకు, యువతకు చిన్న వయసు నుంచే ఆధ్యాత్మిక చింతన ఆధ్యాత్మిక అలవాట్లు నేర్పించగలిగితే వారి భవిష్యత్తుకు బంగారు బాట వేసిన వారమవుతమన్నారు. ఎక్కువ చోట్ల ఆధ్యాత్మిక కార్యక్రమాలకు 60 ఏళ్ల పైబడిన వారు వస్తుంటారని అటువంటి వారి కన్నా యువత ఎక్కువగా ఇటువంటి ప్రవచనాలు వినడానికి వస్తే వారి జ్ఞానం పెంపొందించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. పద్మాకర్ స్వామి వారు కర్నూలుకు రావడం కర్నూలు నేల అదృష్టమని, ఆయన శిష్యులు ఎంతోమంది శిధిలావస్థకు చేరుకున్న ఆలయాలను జీర్ణోదరణ చేశారన్నారు. అటువంటి కార్యక్రమం ఎవరు చేసినా తన వంతు సహకారం అందిస్తానని టీజీ తెలిపారు. పాడుబడిన ఆలయాలకు జీర్ణోదరణకు మనం 25 శాతం నిధులు పెడితే 75% నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తుందని ఆయన తెలిపారు. మన ప్రాంతంలో ఎక్కడ జీర్ణోదరణకు అవసరమైన దేవాలయాలను గుర్తిస్తే మంత్రి భరత్ ద్వారా నిధులు విడుదల చేయిస్తానని టీజీ వెంకటేష్ తెలిపారు. అంతేకాకుండా శిధిలాలయాలకు సమకూర్చవలసిన 25 శాతం నిధులు కూడా తాము సొంతంగా భరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. స్థానికంగా ఉండే ప్రజలు అటువంటి దేవాలయాలను గుర్తించి సరైన ప్రణాళిక తీసుకుని ముందుకు రావాలని ఆయన కోరారు. స్వామీజీ ప్రవచనాల కార్యక్రమానికి సంబంధించి ఎటువంటి పబ్లిసిటీ లేకపోయినా ఇంత మంది జనం రావడం ప్రజల్లో పెరుగుతున్న ఆధ్యాత్మిక చింతనకు నిదర్శనం అన్నారు. వారం రోజులపాటు జరుగనున్న ఈ కార్యక్రమాన్ని నగర ప్రజలందరూ సద్వినియోగం టీజీ వెంకటేష్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, డాక్టర్ వేణుగోపాల్, హరికృష్ణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కూటమి ప్రభుత్వం లో రైతులకు పెద్దపీట :ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అప్పంబట్టులో నూతన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ



వరదయ్యపాలెం జనవరి 3(శ్రీ చక్ర) కూటమి ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు.శనివారం పిచ్చాటూరు మండలం అప్పబట్టులో అన్నదాతలకు ప్రభుత్వం అందించే నూతన పట్టాదారు పాసుపుస్తకాలను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రీ సర్వే ద్వారా అధునాతన సాంకేతిక పరిజ్ఞానం తో భూములను సర్వే చేసి రైతులకు శాశ్వత పట్టాదారు పాసుపుస్తకాలను అందిస్తుందన్నారు.సబ్సిడీ విత్తనాలు,గిట్టుబాటు ధరలకు రైతుల నాయకులు నుండి పంట కొనుగోలు,అన్నదాత సుఖీభవ వంటి సంక్షేమ పథకాలతో రైతులను ఆదుకుంటుందన్నారు.అనంతరం రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పంపిణీ చేశారు. మినీ గోకులం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఆదిమూలంఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించిన మినీ గోకులం షెడ్డు ను ఎమ్మెల్యే ఆదిమూలం శనివారం అప్పబట్టు లో ప్రారంభించారు.పాడి రైతులను అన్నీ విధాలుగా ఆదుకోవాలన్న తపనతో ప్రభుత్వం మినీ గోకులం, పశువుల నీటి తొట్టె నిర్మాణ పనులను చేపడుతుందన్నారు.పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపిన కోట వ్యాపారస్తులు



కోట : జనవరి 3 (శ్రీ చక్ర ):గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపడానికి కారణమైన గూడూరు ఎమ్మెల్యే పాశం.సునీల్ కుమార్ కు కోట ఆర్టీసీ కాంప్లెక్స్ అధ్యక్షుడు ఉదయ భాస్కర్ ఆధ్వర్యంలో వ్యాపారస్తులు అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా శనివారం కోటకు విచ్చేసిన గూడూరు ఎమ్మెల్యే పాశం.సునీల్ కుమార్ ను కోటకు చెందిన వ్యాపారస్తులు శాలువాలుతో సత్కరించి బోకేను అందజేసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కోట వ్యాపారస్తులు ఆర్టీసీ కాంప్లెక్స్ అధ్యక్షులు ఉదయ భాస్కర్ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గం తిరుపతి జిల్లాలో ఉండేదాన్ని మరలా నెల్లూరు జిల్లాలో కలిపినందుకు సంతోషదాయకంగా ఉందని తెలిపారు.ఈ నేపథ్యంలోనే కోట వ్యాపారస్తులు అందరూ కలిసి ఎమ్మెల్యేకు అభినందనలు తెలియజేశామని అన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ మండల అధ్యక్షులు పలగాటి.భాస్కర్ రెడ్డి, ఆర్టీసీ కాంప్లెక్స్ అధ్యక్షులు ఉదయభాస్కర్,గోల్డ్ వ్యాపారస్తులు శ్రీనివాసులు,తదితర కోట వ్యాపారస్తులు ఉన్నారు.

## ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డికి మోడరన్ ఫౌండేషన్ ప్రజావిజేత పురస్కారం



రామచంద్రపురం, జనవరి 3( శ్రీచక్ర)అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి రామచంద్రపురం పట్టణం మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి. వి. రావు మోడరన్ ఫౌండేషన్ తరపున శనివారం ఆరికరేవులలో ప్రజావిజేత పురస్కారం అందజేసారు. ఈ సందర్భంగా జి. వి. రావు, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కొంతసేపు ఆత్మీయంగా ముచ్చడించుకున్నారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తండ్రి మాజీ ఎమ్మెల్యే మూలారెడ్డితో తనకు గల అనుబంధాన్ని రావు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా రావు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే మూలారెడ్డి చేసిన అభివృద్ధి పరంపరను ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు.అనంతరం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యావ్యాప్తికి విశేషంగా కృషి చేస్తున్న మోడరన్ అధినేత జి. వి. రావు అభినందనీయులని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మోడరన్ జూనియర్ కాలేజీ అకడమిక్ అడ్వైజర్ చల్లా శ్రీనివాస్, ఆరికరేవుల సర్పంచ్ రెడ్డి నాగవేణికుమారి, గ్రామ ప్రముఖులు రెడ్డి శ్రీనివాసు, ఇందల వీరబాబు, గంగుమళ్ళ శ్రీనివాస్,కొర్ల వినాయకరావు, బొడ్డు గౌతమ్,తదితరులు పాల్గొన్నారు.

# గతంలో పాస్ బుక్కులపై జగన్ మోహన్ రెడ్డి ఫోటో వేయడం దారుణం...,

**అర్హులైన పేదలకు పాసుబుక్కులు మంజూరు కు శ్రీకారం,,,.**
**బినామీల పేర్లతో ఆక్రమించిన భూములను బయటపెట్టాలి...,**
**అడంగల్ లో ఒక పేరు భూమిపై మరోకరూ...**
**నూతన పట్టాదారు పాసుబుక్కులు పంపిణీ కార్యక్రమం...,**

కోట : జనవరి 3 (శ్రీ చక్ర) : గతంలో పాస్ బుక్కులపై జగన్మోహన్ రెడ్డి ఫోటో వేయడం దారుణమని గూడూరు శాసనసభ్యులు పాశం.సునీల్ కుమార్ అన్నారు.ఈ సందర్భంగా శనివారం కోట మండలంలోని స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో తాహాసిల్దార్ కటారి.జయ జయ రావు ఆధ్వర్యంలో నెల్లూరు పల్లి గ్రామస్తులకు పాసుబుక్కులు పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గూడూరు శాసనసభ్యులు పాశం. సునీల్ కుమార్ విచ్చేశారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భూములను అధికారులు తారుమారు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ భూములను భూస్వాములు ఆక్రమించుకొని పేదలకు అన్యాయం చేశారని ఎద్దేవా చేశారు.పేదలకు ఇచ్చిన పట్టాలను భూస్వాములు ఆక్రమించుకుని సాగు చేసుకోవడం ఏమిటని, అదేవిధంగా పట్టాలు పేదల పేరుమీద ఉండడం,సాగులో భూస్వాములు ఉండడం జరుగుతుందన్నారు.పేదలకు చెందిన భూములు భూస్వాములు చేతిలో ఉన్నాయని,మరి ముఖ్యంగా కోట మండలంలోని భూముల్లో ట్యాంపరింగ్ చేస్తే నిజాలు తెలుస్తాయని అన్నారు. దీనంతటికీ కారణం గతంలో పనిచేసిన ఎమ్మార్వో ముఖ్య కారణమని బహిరంగంగానే తెలియజేశారు.అడంగల్ లో ఒక పేరు,భూమిపై మరొక పేరు ఉండడం హాస్యాస్పదంగా ఉందన్నారు.అంతేకాకుండా ఇలాంటి ఆక్రమణ భూములకి సంబంధించిన విషయాలను విలేఖరులు పత్రికల ద్వారా నిగ్గు తేల్చాలని విలేకరులను ప్రశ్నించారు.అంతేకాకుండా విశ్వసనీయతంగా వార్తలు రాసి పేదలకు భూములు అందేలా చేయాలని తెలిపారు.భూములకి చెందిన దొంగ పట్టా పుస్తకాలు సృష్టికరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా వజ్జవారిపాలెం భూముల విషయాలను పరిశీలించాలని స్థానిక అధికారులకు తెలియజేశారు. భూమిలేని వారికి న్యాయం చేయాలన్నారు.అర్హులైన పేదవారికి భూములను ఇస్తే జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు. నియోజకవర్గంలో ఉన్న సచివాలయ ఉద్యోగస్తులందరూ విశ్వసనీయతగా విధులు నిర్వహించి ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండి న్యాయం చేయాలని తెలిపారు. అంతేకాకుండా కోట మండలంలో అత్యధికంగా ఇల్లులేని వారిని గుర్తించి అర్హులైన వారికి నివేశ స్థలాలను,నివేశ గృహాలను ఏర్పాటు చేయాలని తాహాసిల్దార్, హౌసింగ్ ఏఈలకు చెప్పారు. ఇకమీదట విడతల వారీగా పట్టా పాసు బుక్ లను మంజూరు చేస్తామన్నారు.గత ప్రభుత్వంలో ప్రజలు భయంతో బ్రతకారని,అదేవిధంగా బెదిరింపులు,దౌర్జన్యాలు ఉండేవని, ప్రస్తుతం అలాంటివి ఏమీ లేవని అందరూ సస్యశ్యామలంగా ఉన్నారని గుర్తు చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,పవన్ కళ్యాణ్,నారా లోకేష్ బాబు నూతన పాస్ బుక్ లు మంజూరు పై మంచి నిర్ణయం తీసుకోవడం సంతోషకరం అని అన్నారు.అనంతరం నెల్లూరు పల్లి రైతులకు నూతన పట్టాదారు పానుబుక్కు లను అందజేశారు.ఈ కార్యక్రమంలో తాహాసిల్దార్ కటారి.జయ జయ రావు,ఎంపీడీవో దిలీప్ కుమార్ నాయక్,టిడిపి మండల పార్టీ అధ్యక్షులు పలగాటి.భాస్కర్ రెడ్డి, నెల్లూరు మోహన్ రెడ్డి,తిరుపతి పార్లమెంటు మైనార్టీ అధ్యక్షులు షేక్.జలీల్ అహ్మద్,కోకర్ల మధు యాదవ్,మారం రెడ్డి శ్రీధర్ రెడ్డి, ఎంపీటీసీ నారాయణ,బందెల రఘురామ్,కర్లపూడి రాంబాబు, పల్లెమల్లు.వెంకట కృష్ణారెడ్డి, తదితర టిడిపి నాయకులు,స్థానిక అధికారులు,నెల్లూరు పల్లి రైతులు పాల్గొన్నారు.





## ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం...,
## ఘనంగా జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం...,





కోట :జనవరి 3 (శ్రీ చక్ర): స్త్రీల విద్యాభివృద్ధికి పాటుపడిన ప్రముఖ సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శనివారం కోట మండలంలోని ఎంపీడీవో కాన్ఫరెన్స్ హాల్ నందు స్థానిక ఎంఈఓ దారా.మస్తానయ్య ఆధ్వర్యంలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కోట మండలంలో ముగ్గురు ఉత్తమ ఉపాధ్యాయినీలను ఎంపిక చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోట తాసిల్దార్ కటారి జై జై రావు ఎంపీడీవో దిలీప్ కుమార్ నాయకులు హాజరయ్యారు. మొట్టమొదటిగా సావిత్రిబాలే చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు.అనంతరం సావిత్రిభాయి పూలే గూర్చి పలు విషయాలను ఉపాధ్యాయులకు తెలియజేశారు.జి.పుష్పావతి ఎస్జీటీ వీరారెడ్డి సత్రం,బి శశికళ ఎస్జిటి ఊనుగుంటపాలెం,ఏ ఎస్ పురం స్కూల్ ఎస్ జి టి సిహెచ్.మంజరి లను ఎంపిక చేసి తాహాసిల్దార్ కటారి.జయ జయ రావు,ఎంపీడీవో దిలీప్ కుమార్ నాయక్,ఎమ్ ఈ ఓ దారా.మస్తానయ్య లు శాలువాలు,పూలమాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా డిసెంబర్ 31న రిటైర్ అయిన కే. ప్రమీల ఉపాధ్యాయురాలను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయనీలు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద కుటుంబానికి 10 వేలు రూ,, ఆర్థిక సహాయం చేసిన ... శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి





పోలవరం జనవరి 3, (శ్రీ చక్ర)గత కొన్ని రోజుల క్రితం పోలవరం మండలం కార్మెల్ పురం గ్రామంలో అగ్ని ప్రమాదానికి గురై ఇల్లు దగ్ధమై సర్వం కోల్పోయి నిరాశ్రయులైన అభిమళ్ళ సత్యనారాయణ కుటుంబసభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు , ఈ విషయాన్ని తెలుసుకున్న శాప్ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి, విజయ నాయక్ దంపతులు శనివారం 10 వేల రూపాయలు ఆర్థిక సహాయంగా అందించారు. ఈ సందర్భంగా జగదీశ్వరి మాట్లాడుతూ,ఆపదలో ఉన్న కుటుంబానికి తమ వంతు సహాయంగా 10 వేలు అందించినట్లు తెలిపారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని, ప్రభుత్వంతో పాటు ప్రజా ప్రతినిధులు ,స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వచ్చి బాధితులను ఆదుకోవాలని ఆమె తెలియజేశారు.

## సావిత్రిబాయి పూలే జయంతి ని భారత మహిళా విద్యా దినంగా ప్రకటించాలి. యాట్ల



రామచంద్రపురం, జనవరి 3 (శ్రీచక్ర)భారతదేశంలోని సామాజిక కట్టుబాట్లను సనాతన సంప్రదాయాలను ధిక్కరించి మొదటి బాలికల పాఠశాల ను స్థాపించిన క్రాంతిజ్యోతి, భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని నియోజకవర్గం ఎం.బీ.సీ సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు అన్నారు. సావిత్రిబాయి పూలే 195 వ జయంతి సందర్భంగా ద్రాక్షారామ మసీదు సెంటర్ లో ఉన్న పూలే దంపతులు విగ్రహాలకు కొండేపూడి వినయ్ కుమార్, పడిదకల బీమశంకరం, బిల్లకుర్తి స్వామి, గారోజు సూరిబాబు, షేక్ సిద్ధూ, కొల్లపు కామేశ్వరరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం యాట్ల మాట్లాడుతూ స్త్రీకి చదువు హక్కు లేని చీకటి కాలం, ఆ కాలంలో మహిళలకు చదువు అనేది పాపంగా భావించబడేది. ఆడవాళ్ళు చదివితే బుద్ధి నశిస్తుంది అనే అంధ విశ్వాసాలు ఉండేవి. మహిళలు ఇంటి పనులు, వంట, పిల్లలను పెంచడం వరకు మాత్రమే పరిమితయ్యేవారు. కులం, మతం, లింగం అన్నింటి పేరుతో విద్యా ద్వారాలు మూసివేయబడ్డాయి. అలాంటి పరిస్థితుల్లో స్త్రీకి చదువు అనేది మానవ హక్కు అని భావించిన సావిత్రిబాయి పూలే తన భర్త మహాత్మా జ్యోతిరావు పూలే సహకారంతో 1848 జనవరి 1న మహారాష్ట్ర లోని పూణే నగరంలో మొట్ట మొదటి బాలికల పాఠశాల ను స్థాపించారు. ప్రతీ రోజూ బడికి వెళ్ళేటప్పుడు ఆమెపై రాళ్ళు, మలినాలు, వేయబడినా అపహాస్యం, దూషణలు ఎదురైనా ఆమె అడుగులు ఆగలేదు. ఆమె చేతిలోని పుస్తకం పడిపోలేదు. ఎందుకంటే ఆమెకు తెలుసు. ఒక బాలిక చదువుకుంటే ఒక తరం వెలుగులోకి వస్తుందని. ఈ రోజు బాలికలు చదువుతున్నారంటే వారి చేసిన త్యాగాలు మరువ లేనివి.ఇది ఒక సామాజిక జ్ఞాపకం, ఇది ఒక విప్లవ స్మరణ, విద్యే విముక్తికి మార్గం అని తెలిపారు. జనవరి 3న భారత మహిళా విద్యా దినంగా ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి. రామకృష్ణ, ఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నాలుగేళ్ల చిన్నారిని చితకబాదిన టీచర్

**టీచర్ ,యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి**
**పునరావృతం కాకుండా చర్యలు: మంత్రి సుభాష్**









రామచంద్రపురం, జనవరి 3 (శ్రీచక్ర)అభం శుభం తెలియని ఎల్ కేజీ చదువుతున్న నాలుగేళ్ల చిన్నారిపై క్లాస్ టీచర్ దారుణంగా చితకబాదిన ఘటన రామచంద్రపురం పట్టణంలో శ్రీ వివేకానంద స్కూల్లో చోటుచేసుకుంది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం చెల్లూరు గ్రామానికి చెందిన పి. నిహారిక (ఎల్ కేజీ) చదువుతున్న చిన్న పాపని రామచంద్రపురం శ్రీ స్వామి వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ చేర్పించారు. దీంతో శుక్రవారం కాస్ టీచర్ అతి దారుణంగా చిన్నారిని కొట్టడంతో ఒంటి మీద పలుచోట్లతోపాటు తలపై కూడా గాయాల పాలయ్యింది . దీంతో విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు స్కూలు యాజమాన్యాన్ని నిలదీయడంతో టీచర్ సంఘటనపై స్పందన పట్ల తృప్తి చెందని తల్లిదండ్రులు చిన్నారికి వైద్యం చేయించి శనివారం స్కూలు ఎదుట టిచర్ పై చర్చ తీసుకోవాలని ఆందోళన చేపట్టారు . దీంతో వెంటనే ఆ టీచర్ పై స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్య తీసుకోవాలని పోలీసులను సైతంఆశ్రయించారు. పిల్లల్ని స్కూల్ కి పంపేది చదువు చెప్పమనేకాని ఇంత దారుణంగా కొట్టమని కాదని చిన్నారి తల్లిదండ్రుల ఆవేదన వ్యక్తంచేసారు శనివారం చిన్నారి తల్లిదండ్రులతో పాటు పలువురు స్కూలు ఎదుట ఆందోళన దిగారు.స్కూల్ ఎదుట ధర్నా నిర్వహించి యాజమాన్యంపై బాధ్యురాలైన టీచర్ పై చర్యలు తీసుకోవాలంటూ ఆందోళన చేపట్టారు.దీంతో అదే సమయంలో అటుగా వెళుతున్న రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ కారు దిగి ఆందోళన కారులతో మాట్లాడి జరిగిన విషయం తెలుసుకున్నారు.అనంతరం స్కూల్ యాజమాన్యం, టీచర్, పేరెంట్స్ తో మంత్రి సుభాష్ స్వయంగా మాట్లాడి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని స్కూల్ యాజమాన్యంకి సూచించారు. సంఘటనపై చిన్నారి తల్లి తండ్రులు స్కూలు యాజమాన్యం ఒక నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం . ఇదిలాఉండగా చిన్నారిని టీచర్ కొట్టడం వాస్తవమేనని సంఘటన దురదృష్టకరమైనదని సంఘటనపై సరైన సమయంలో స్పందించకపోవడంతో ఇక్కడ ఈ పరిస్థితి నెలకొందని మంత్రి సుభాష్ స్పష్టం చేశారు.

శ్రీచక్ర

ఆదివారం జనవరి 04 2026

## కండక్టర్లకు పవర్ బ్యాంక్లు పంపిణీ



రామచంద్రపురం, జనవరి 3 (శ్రీచక్ర)ఏపీఎస్ఆర్టీసీ రామచంద్రపురం డిపో పరిధిలో అమలులో ఆర్టీసీ కండక్టర్లకు పవర్ బ్యాంకులో అందజేశారు. ఈ మేరకు శనివారం శ్రీ శక్తి పథకంలో భాగంగా ప్రయాణికుల సౌకర్యార్థం ,అధిక రద్దీని తట్టుకోవడానికి డిపో మేనేజర్ పేపకాయల భాస్కర్ రావు ఆర్టీసీ కండక్టర్లకు 2000 ఎం ఎం హెచ్ పవర్ బ్యాంక్లు అందజేశారు . ఈ సదుపాయం అన్ని పల్లె వెలుగు బస్సులకు కలుగజేయడం జరుగిందని మేనేజర్ పేర్కొన్నారు .దీనివల్ల ప్రయాణికులకు ఏపీఎస్ ఆర్టీసీ ట్రాక్ ద్వారా బస్సు ఎక్కడ ఉన్నది అనేది తెలుసుకోవడం తోపాటు యూపీఐ పేమెంట్ కూడా త్వరితగతిని చేసుకోవడానికి వీలుంటుంది దీన్ని ఉపయోగించి కండక్టర్ల తగినంత చార్జింగ్ చేసుకోవాలని అలాగే వీటిని డ్యూటీలో జాగ్రత్తపరుచుకోవాలని ఆయన సూచించారు.

## బాలుర ఉన్నత పాఠశాల నందు బాలుర

### ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు



మార్కాపురం జనవరి 3 శ్రీ చక్రమార్కాపురం బాలుర ఉన్నత పాఠశాల, మార్కాపురం. నందు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మార్కాపురం మండల విద్యాశాఖ అధికారి కె. శార్వాణి గారు ముఖ్యఅతిథిగా సావిత్రిబాయి పూలే 195 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది..ఈ సందర్భంగా కె. శర్వాణి మాట్లాడుతూ, మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే గారి జన్మదినాన్ని నిర్వహించడం చాలా ఆనందదాయకమని, విద్యకు సామాజిక అభివృద్ధికి కృషి చేసిన గొప్ప మహిళ సావిత్రిబాయి పూలే అని, మహిళలు చదువుకుని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకమని తెలియజేశారుపాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ... ఒకవైపు కుటుంబాన్ని చూసుకుంటూ, మరోవైపు ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ, భూదేవికి ఉన్న సహనానంతో, సమాజంలో ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దుటలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళ ఉపాధ్యాయులు చాలా గొప్పవారని..స్ఫూర్తి ప్రదాతలని అన్నారు..ఈ సందర్భంగా పాఠశాలలోని మహిళ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించడం జరిగింది...ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయు, ఉపాధ్యాయేతర సిబ్బంది..విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## రైతుల సంక్షేమం, ప్రజారోగ్యమే ఎన్డీఏ ప్రభుత్వం లక్ష్యం.

### బీజేపీ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి.డాక్టర్ ఏలూరి.

రామచంద్రారెడ్డిమార్కాపురం జనవరి 3 శ్రీ చక్రమార్కాపురంరైతుల సంక్షేమం, ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం విజయవాడలో జరిగిన బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన సహజ మరియు సేంద్రీయ వ్యవసాయంపై చర్చా కార్యక్రమం ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏలూరి మాట్లాడుతూ నానాటికీ వ్యవసాయ రంగంలో కృత్రిమ ఎరువులు, రసాయనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో భూమిలో సారం తగ్గిపోతోందని, దీనివలన ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సేంద్రీయ (ఆర్గానిక్) వ్యవసాయం కాలానికి అనుగుణమైన అవసరమని, ఇది రైతులకు మంచి ఆదాయం, వినియోగదారులకు ఆరోగ్యకరమైన ఆహారం అందిస్తుందని అన్నారు. రైతులు ప్రకృతి హితమైన పద్ధతులు అవలంబించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక విధానాలు అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం.. ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు నేరుగా ఆర్థిక సహాయం, ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా పంట నష్టాలకు భరోసా, జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ వంటి పథకాలతో సేంద్రీయ వ్యవసాయానికి ప్రోత్సాహం వంటి నిర్ణయాలతో రైతులకు బాసటగా నిలుస్తుందని అన్నారు. ఆర్గానిక్ వ్యవసాయం భూమి సారాన్ని కాపాడడమే కాకుండా నీటి వినియోగాన్ని తగ్గించి పర్యావరణ సమతుల్యతను నిలుపుతుందని చెప్పారు. రైతులు తక్కువ ఖర్చుతో దీర్ఘకాలిక లాభాలు పొందేందుకు సేంద్రీయసాగుదోహదపడుతుందని, భవిష్యత్ తరాల ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ దీనికి మద్దతు ఇవ్వాలని డాక్టర్ రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు.



# ఘనంగా స్వర్గీయ శ్రీ కందుల ఓబుల రెడ్డి 33 వ వర్ధంతి కార్యక్రమం

మార్కాపురం జనవరి 3 శ్రీ చక్రమార్కాపురం స్వర్గీయ కందుల ఓబులరెడ్డి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు మరియు మాజీమంత్రివర్యులు.కందులవంశ మనిదీపం. దేశ స్వాతంత్రం కోసం ఆస్తులన్నీ త్యజించి జైళ్లలో సైతం మగ్గిన రాయలసీమ రత్నం. నీతి, నిజాయితీలకు నిలువెత్తు సాక్షి.దూరాలోచన, లోతైన పరిశీలన, ప్రగతి కోసమై పాలన, నిజాయితీకి నిలువెత్తు దర్పణం 1972 లో కొత్తగా ఏర్పడిన ప్రకాశం జిల్లాలో మార్కాపురం డివిజన్ కలిపినప్పుడు ఈ ప్రాంత ప్రయోజనాల కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని నిరంతరం పోరాడిన మగమహారాజు.వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం 1980 ప్రాంతంలో అప్పటి ముఖ్యమంత్రి అంజయ్య గారిని ఒప్పించి, ప్రాజెక్టు ప్రతిపాదన చేసి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేపించారు . ప్రజా శ్రేయస్సే ఊపిరిగా, జీవితాన్ని కర్పూరంగా వెలిగించి. రాజకీయ విలువలకై ఎందరో నాయకులను ఎదిరించిన ధీశాలి. ప్రజల హృదయాలలో నివసిస్తున్న దివ్యమూర్తి. సుదీర్ఘ 35 సం??లుగా శాసనసభ్యులు, ఆర్టీసీ చైర్మన్ గా వ్యవసాయ, ఆటవీ , పశుసంవర్ధకశాఖ ,నీటిపారుదలశాఖామాత్యులుగా, “పుల్లరి” విధానాన్నిరద్దుచేసి,నీటిపారుదలరంగంలోఅవిశ్రాంతంగా కృషిచేసిన గుండ్లకమ్మ ప్రాజెక్ట్ సార్ధక నామధేయులు. రైతు భాంధవుడు, ప్రజలతో మమేకమైన మహామనిషి స్వర్గీయశ్రీ కందుల ఓబులరెడ్డి .ప్రస్తుత మార్కాపురం జిల్లాలోని యర్రగొండపాలెం, మార్కాపురం మరియు కంభం నియోజకవర్గాలకు శాసనసభ్యునిగా ప్రాతినిధ్యం వహించడం చెప్పుకోదగ్గ విషయం . ఎందరో రాజకీయ నాయకులకు ఓనమాలు దిద్దించి, పంచెకట్టించిన రాజకీయ గురువు. ఆయన అడుగుజాడల్లో నడిచి ఎందరో గొప్ప గొప్ప నాయకులుగా తయారు కావడం జగమెరిగిన సత్యం. పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి, కోట్ల విజయభాస్కర్ రెడ్డి, కడప రామసుబ్బమ్మ, కొణిజేటి రోశయ్య, సర్దార్ గౌతు లచ్చన్న , భవనం వెంకట్రామి రెడ్డి తదితరులు కందుల ఓబులరెడ్డికి గారికి ముఖ్య అనుచరులుగా పనిచేశారుభారతదేశ మొదటి డెప్యూటీ ప్రధాన మంత్రి మరియు హోమ్ మంత్రి అయిన సర్దార్ వల్లభాయ్ పటేల్ గారికి ఓబుల రెడ్డి సన్నిహితంగాఉండేవారు !! రైతు జన బాంధవ్యులు ఆచార్య ఔఉ రంగా గారి శిష్యులుగా బ్రిటీష్ పాలనలో అనేక రైతాంగ పోరాటాలుచేసినగొప్పనాయకుడు, నిష్కపటి, నిరాడంబరుడైన స్వర్గీయ శ్రీ కందుల ఓబులరెడ్డి జీవితం భావితరాలకు స్ఫూర్తి దాయకం.ఓబులరెడ్డి1983లో రాజకీయాల నుండి వైదొలిగారు. స్వర్గీయ ఎన్ . టీ. రామారావు టీడీపీ పార్టీ స్థాపించి ఓబుళరెడ్డి అనుభవాన్నిదృష్టిలోఉంచుకునిసలహాదారునిగా సూచనలు, సలహాల కోసం ఆహ్వానించినా, సున్నితంగా తిరస్కరించిఅయన శేష జీవితాన్ని స్వగ్రామం లింగాపురంలో గడిపారు. 03.01.1993 వ తేదీనస్వర్గస్తులైనారు .మార్కాపురం డివిజన్లో ఆర్థికంగా అణగారిన అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం ,ఆర్థికంగా ,సామాజికంగా అభివృద్ధి చెందిన సమాజం కోసం ఎనలేని కృషి చేసారు . విద్య , వైద్య , ఉద్యోగ , ఉపాధి రంగాల్లో వేలాది మందికి సహాయ సహకారాలు అందించారు . వందలాది మందికి వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశం కల్పించారు . ఓబులరెడ్డి రైతుకు, వ్యవసాయ రంగానికి నీటిపారుదలరంగంలోచేసిన సేవను ప్రభుత్వం గుర్తించి ప్రకాశం జిల్లా గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాజెక్టుకు ఓబులరెడ్డి గారి పేరు పెట్టి జాతికి అంకితం చేసి ఆయన పేరు చిరస్మరణీయం చేసారు ! ఈనాడు ఓబుల రెడ్డి గారి 33 వ వర్ధంతి సందర్బంగా కంద ౦ల గౌతమ్ నాగి రెడ్డి గారి ఆధ్వర్యంలో ౨ాంఐఖ కాలేజీ ఎదురుగా ఉన్న ఓబుల రెడ్డి గారి విగ్రహానికి పూల మాలలు వేసిఅయనఅభిమానులు ,సన్నిహితులు ,శిష్యులుమ రియుఅను య ౨ాయులు ఆమహానుభావున్నిస్మరిం చుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ అల్పాహారం చేయడం జరిగింది



# మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలి

## అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ కొత్త పథకాన్ని రద్దుచేసేంతవరకు ఉద్యమిస్తాం

మార్కాపురం జనవరి 3 శ్రీ చక్రమార్కాపురం మహాత్మా గాంధీ పేరుతో 2006 ఫిబ్రవరి 2 వ తేదీన గ్రామీణ పేదలకు, రైతులకు, కర్షకులకు ఉపాధి కల్పన కోసం ఏర్పాటుచేసిన నారేగా పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని కోరుతూ నేడు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా అధ్యక్షతన పట్నం లోని ప్రెస్ క్లబ్ లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశ ంలో వివిధ రాజకీయ పక్షాల నేతలు, కార్మిక ,కర్షక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా మాట్లాడుతూ20సంవత్సరాల క్రితం గ్రామీణ చిన్న , సన్నకారు రైతులకు, బడుగు బలహీన వర్గాలు వలసల బాట పట్టకుండా వారికి ఉపాధి కల్పించడం కోసం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాటి ప్రధాని మన్మోహన్ సింగ్ యూపీఏ చైర్మన్ శ్రీమతి సోనియా గాంధీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్లోని అనంతపురం జిల్లా బండ్లపల్లి గ్రామంలో ప్రారంభించడం జరిగిందని ఆనాటి నుండి ఈనాటి వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కోట్లాదిమందికి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరిందని అలాంటి మహోన్నత పథకాన్ని మహాత్మా గాంధీ పేరుని తొలగించి విబిజి రాంజీ పేరుతో కొత్త చట్టాన్ని తీసుకొని రావడం ఎన్డీఏ కూటమి దివాలా కోరుతారనికి నిదర్శనమని ఆయన తీవ్రంగా విమర్శించారు, కొత్త చట్టాన్ని రద్దు చేసే వరకు అన్ని పక్షాలతో కలిసి ఉద్యమిస్తామని సైదా తెలిపారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందే నాసరయ్య మాట్లాడుతూ పేదల కొట్టే ఇలాంటి నల్ల చట్టాలను అందరూసమిష్టిగావ్యతిరేకించాలని ఆయన కోరారు, ఆప్ జిల్లా అధ్యక్షులు సుదర్శన్ మాట్లాడుతూ బీజేపీ నియంతృత్వ పాలనలో ప్రతిపక్ష నేతలను అనేకమందికి జైలుకు పంపించిన ఘనత మోడీ అమిత్ షా దేనిని రానున్న రోజుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన ఘాటుగా విమర్శించారు, సిపిఎం నాయకులు బాలనాగయ్య మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి 12 సంవత్సరాల కాలంలో ఈ దేశాన్ని అన్ని విధాలుగా నాశనం చేసిందని అదా నీ అంబానీలకు ఈ దేశ సంపదను దోచిపెట్టిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఎంపీ జే రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ బిజెపి పాలనలో వర్గ వైశ్యామ్యాలు, విద్వేషరాజకీయాలుచోటుచేసుకున్నాయని మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందని ఆయన అన్నారు, లఞ౨ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతలపాటి రాజు మాట్లాడుతూ అన్ని రాజకీయ పక్షాలు ఏకమై నిరంకుశ మోడీని గద్దె దించాలని ఆయన అన్నారు. లోక్సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ మోడీ అమిత్ షా జోడి ఈ దేశానికి పట్టిన రాహు కేతులని ఆయన తీవ్రంగా విమర్శించారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు షేక్ మహబూబ్ అలీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ద్వారానే ఈ దేశంలోని అల్ప సంఖ్యాక వర్గాలకు రక్షణ ఏర్పడుతుందని అందరం ఏకమై బిజెపినల్లచట్టాలనువ్యతిరేకించాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా రైతు సంఘం నాయకులు గాలి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ బీజేపీ హయాంలో రైతులు అన్ని విధాలుగా నష్టపోయారని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలుమొట్టమొదటి మహిళా ఉపాధ్యాయుని మహిళల అక్షరాస్యత కోసం పరితపించిన మహనీయురాలు స్వర్గీయ సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సైదా ఆధ్వర్యంలో అఖిలపక్ష నాయకుల పూలదండలేసి ఘనంగా నివాళులర్పించారు. మార్కాపురం జిల్లా సాధన కోసం 65 రోజులపాటు మహోన్నత ఉద్యమం నడిపిన మార్కాపురం జిల్లా సాధన సమితి కన్వీనర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా ను రౌండ్ టేబుల్ సమావేశం సందర్భంగా అఖిలపక్ష నేతలందరూ ఆయన పోరాటపటి మను గుర్తు చేసుకొని అఖిలపక్ష నేతలందరూ ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మార్కాపూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇమ్రాన్, సిపిఎం పట్టణ అధ్యక్షులు ఏడుకొండలు, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి షేక్ ఖాసీం, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు షేక్ రెహనాబాను, సిఐటియు జిల్లా అధ్యక్షులు రూబెన్, కర్లపాడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ హుస్సేన్, వెల్ఫేర్ పార్టీ మార్కాపూర్ పట్టణ అధ్యక్షులు షేక్ రసూల్, ఎంపీ జి ఏ పార్టీ నాయకులు షేక్ మీరావాలి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని, మార్కాపూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్లా, ఖాసిం, ఇమ్రాన్ ,అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమం





మార్కాపురం జనవరి 3 శ్రీ చక్రమార్కాపురం మండలం ధరిమడుగులోని ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వి.హెచ్.ఆర్ విద్యసంస్థలచైర్మన్వెన్నాహనుమారెడ్డి పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా హనుమారెడ్డి గారు మాట్లాడుతూ మహిళా విద్యకు అంకురార్పణ చేసి, మహిళల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషిచేసిన సావిత్రిబాయి అందరికీ ఆదర్శనీయమని తెలిపారు. విద్య ప్రాధాన్యతను గుర్తించి కట్టుబాట్ల మధ్య ఉన్న మహిళలకు విద్యతోనే పూర్తి స్వేచ్ఛ, స్వాతంత్రం లభిస్తాయని దృఢంగా విశ్వసించిన సావిత్రి బాయి, మహిళల హక్కుల కోసం విశేషంగా కృషి చేసారని, ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించేందుకు కృషి చేయాలని సూచించారు. భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రిబాయి ఖ్యాతి సంపాదించి మహిళా విద్యకు బీజం వేశారని తెలిపారు. ఈనాడు మహిళలు అన్ని రంగాల్లో పురుషులతోసమానంగారాణిస్తున్నందుకు సావిత్రిబాయి పూలే ఆనాడు చేసిన సంస్కరణలే కారణమని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.శంకర్ బాబు,డీన్ డాక్టర్ చంద్రరేఖ, డిప్లమా ఇంచార్జ్ మాధవి,వివిధ విభాగాల హెచ్.ఓ.డి లు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.




## బెజవాడ కోకాపేటగా కానూరు

విజయవాడ, జనవరి 3, విజయవాడ శివారు ప్రాంతాలైన కానూరు, పోరంకి ప్రాంతాలు భవిష్యత్తులో కోకాపేట స్థాయికి ఎదుగుతాయన్న అంచనాలు రియల్ ఎస్టేట్ వర్గాలు వేస్తున్నాయి. కానూరు, పోరంకి, తాడిగడప వంటి ప్రాంతాలు ఇప్పుడు ఇన్వెస్టర్ల హాట్ ఫేవరెట్గా మారాయి. రాజధాని అమరావతి నిర్మాణ పనుల్లో వేగం పెరగడం, ప్రభుత్వం మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టడంతో ఈ ప్రాంతాల్లో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.త్వరలోనే ఇక్కడ భారీ ఆకాశహర్మ్యాలు, వాణిజ్య సముదాయాలు వెలుస్తాయన్న అంచనాలతో రియల్ ఎస్టేట్ రంగం కొత్త ఉత్సాహంతో కనిపిస్తోంది. ఇలాంటి అంచనాలు రావడానికి ప్రధాన కారణం ఇక్కడి అద్భుతమైన కనెక్టివిటీ. అమరావతి రాజధాని నగరానికి నేరుగా అనుసంధానించేలా నిర్మిస్తున్న వెస్ట్ బైపాస్ రోడ్డు కీలకంగా మారింది. దీనివల్ల విజయవాడ నగరంతో సంబంధం లేకుండా నేరుగా రాజధాని ప్రాంతానికి, అటు గుంటూరుకు చేరుకునే సౌలభ్యం కలగనుంది.కాస్త ఆలస్యం అయినా మరో రెండేళ్లలో గ్రేటర్ విజయవాడ ప్రతిపాదన కూడా కార్యరూపం దాలుస్తుండటంతో, భవిష్యత్తులో ఇక్కడ అత్యున్నత స్థాయి మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని భా?స్తున్నారు. ఈ అంచనాల ఫలితంగానే గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ప్రాంతాల్లో ల్యాండ్ డీల్స్ సంఖ్య పెరిగింది. ప్రధాన పలుకుతున్నాయి. గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు, లగ్జరీ అపార్ట్మెంట్ల నిర్మాణం ఊపందుకుంది. బహుళ జాతీయ సంస్థలు తమ కార్యాలయాల కోసం ఇక్కడ స్థలాలను అన్వేషిస్తుండటంతో, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కూడా పెద్ద ఎత్తున భూములను సమీకరిస్తున్నారు.

# చలికాలంలో చింతపండు తింటే ప్రమాదమా?



చింత కాయలతో మనందరి విడదీయరాని అనుబంధం ఉంది. మరీ ముఖ్యంగా 90బ కిడ్స్ కు చింత చెట్లతో ఉన్న బాండింగ్ వేరే. చిన్నప్పుడు హోలి డేస్ లో చింతచెట్ల దగ్గర చేసిన సందడితో పాటు.. రుచి చూసిన చింతకాయలు.. ఇంకా మనకు మధురానుభూతులే. సంక్రాంతి సెలవులకు పల్లెటూర్లు వెళ్లిన వాళ్లందరూ కచ్చితంగా చింతకాయలు టేస్ట్ చేసే ఉంటారు. మరి చలికాలంలో చింతపండు, చింతకాయలు తింటే ఏమవుతుంది. అసలు చింతపండు ఆరోగ్యానికి మంచిదేనా? భారతీయ వంటకాలలో చింతపండు ఒక సాధారణ పదార్థం. కానీ అందులో దాగి ఉన్న పోషక విలువలు అమోఘం. కేవలం రుచికోసమే కాదు ఆరోగ్య పరిరక్షణ కోణంలోనూ చింతపండుది ముఖ్యమైన పాత్ర. యాంటీ ఆక్సిడెంట్లు, ఫైటోకెమికల్స్ తో పాటు విటమిన్లు ఏ, సి, ఈ, కే, బీ6 వంటి అనేక సూక్ష్మ పోషకాలు ఉన్నాయి. అంతేకాదు చింతపండులో మెగ్నీషియం, ఫాస్పరస్, కాల్షియం, పొటాషియం, వంటి ఖనిజాలు కూడా దండిగా ఉంటాయి. ఇవన్నీ మానవ శరీరాన్ని అనేక రకాల ఆరోగ్య సమస్యల నుంచి బయటపడేస్తాయి. రోజూ తినే ఆహారంలో చింతపండును చేర్చుకోవడం ద్వారా ఇమ్యూనిటీని కూడా పెంచుకోవచ్చు. వాతావరణ మార్పుల సమయంలో మరీ ముఖ్యంగా చలికాలంలో తరచూ వచ్చే జలుబు దగ్గు వంటి సమస్యల నుంచి రక్షణ పొందడంలో చింతపండు ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే విటమిన్ సీ ఇమ్యూనిటీని పెంచి శరీరాన్ని జలుబు, దగ్గు నుంచి రక్షిస్తాయి. చలికాలంలో చాలా మందికి జీర్ణక్రియ మందగిస్తుంది. చలి నుంచి విముక్తి కోసం తీసుకునే టీ,కాఫీలు జీర్ణక్రియపై ప్రభావాన్ని చూపుతాయి. కాబట్టి చింతపండు తీసుకుంటే ఉండే సహజ పదార్థాలు జీర్ణక్రియను మెరుగుపరచి మెటబాలిజాన్ని చురుకుగా ఉంచుతాయి.గుండెకు మంచిది.. గుండె ఆరోగ్యానికి చింతపండు బాగా పని చేస్తుంది. ఇందులో ఉండే పాలీఫెనాల్స్ ఫ్లేవనాయిడ్లు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో సహాయపడతాయి. అదే సమయంలో మంచి కొలెస్ట్రాల్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో తోడ్పడతాయి. ఇందులో సమృద్ధిగా ఉండే పొటాషియం హార్ట్ బీట్ ను బ్యాలెన్స్ చేస్తుంది. ట్టుకు బలం చలికాలంలో చాలా మందికి చుండ్రు సమస్య ఎక్కువగా ఉంటుంది. పైగా జుట్టు రాలిపోతుంది. జుట్టు ఆరోగ్యం కోసం చింతపండులోని విటమిన్లు ఖనిజాలు బాగా పనిచేస్తాయి. హెయిర్ ఫాల్ ను తగ్గిస్తుంది. క్రమంగా చింతపండును ఆహారంలో భాగం చేస్తే జుట్టు సహజంగా బలంగా మెరుస్తూ ఉండేందుకు తోడ్పడుతుంది.

# "దొండకాయ గోంగూర" పచ్చడి ఎప్పుడైనా తయారీ చేశారా..?



తెలుగు వారి వంటగదిలో గోంగూరకు ఉండే స్థానమే వేరు. దీనిని కేవలం ఒక ఆకుకూరగా కాకుండా, "ఆంధ్ర మాత" అని ఎంతో గౌరవంగా పిలుచుకుంటారు. గోంగూర లేనిదే తెలుగు వారి విందు పూర్తి కాదు అని అంటే అతిశయోక్తి కాదు. అందుకే గోంగూరతో రకరకాల వంటకాలు చేస్తూ ఉంటారు. ముఖ్యంగా గోంగూర పచ్చడి: రోటి పచ్చడి అయినా, నిల్వ పచ్చడి అయినా గోంగూర రుచే వేరు. వేడి వేడి అన్నంలో నెయ్యి, గోంగూర పచ్చడి వేసుకుని తింటే ఆ తృప్తి అమూల్యం. అలానే గోంగూర పప్పు,మాంసాహార ప్రియులకు 'గోంగూర మటన్' లేదా 'గోంగూర చికెన్' ఒక అద్భుతమైన కాంబినేషన్ గా ఉంటుంది. అయితే గోంగూర కాంబినేషన్‌లో మీరు ఇప్పటివరకు రుచి చూడని ప్రత్యేకమైన పచ్చడిని ఇప్పుడు తెలుసుకుందాం. అదే నోరూరించే "దొండకాయ గోంగూర" పచ్చడి. ఈ సరికొత్త పచ్చడి ఎన్నడూ లేని కమ్మదనాన్ని అందిస్తుంది. ఒక్కసారి తింటే మళ్ళీ మళ్ళీ చేయించుకోవాలనివిన్నది. దొండకాయ ఇష్టం లేని వారు సైతం ఈ పచ్చడిని తెగ ఇష్టపడతారు. దీని రుచికి ఇంట్లో వారంతా లొట్టలేసుకుంటూ తింటారు. మరి ఈ ప్రత్యేకమైన దొండకాయ గోంగూర పచ్చడి తయారీకి కావలసిన పదార్థాలు, విధానం మీకోసం ప్రత్యేకంగా.. కావాల్సిన పదార్థాలు.. గోంగూర – ఒక పెద్ద కప్పు దొండకాయలు – పావుకిలో నూనె – తగినంత ఆవాలు – ఒక చెంచా జీలకర్ర – ఒక చెంచా ఎండుమిర్చి – నాలుగైదు కరివేపాకు – కొద్దిగా పచ్చిమిర్చి – మూడ్నాలుగు పసుపు – కొద్దిగా ఉప్పు – రుచికి తగినంత తయారీ విధానం. ముందుగా తాజా గోంగూరను కాడల నుంచి వేరుచేసి శుభ్రంగా కడిగి, అదనపు నీరు పోయేలా జల్లెడలో వేసి పక్కన పెట్టుకోవాలి. ఈలోపు దొండకాయలను శుభ్రంగా కడిగి, చిన్న పొడవాటి ముక్కలుగా తరగాలి. అలాగే పచ్చిమిర్చిని నిలువుగా చీలికలుగా కట్ చేసుకోవాలి. పాన్‌లో తగినంత నూనె వేడిచేసి, ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, కరివేపాకు వేసి వేయించుకోవాలి. (అవి వేగాక, పచ్చిమిర్చి చీలికలు, పసుపు వేసి బాగా కలపాలి) ఆ తర్వాత, కడిగిన గోంగూరను వేసి, మధ్యమధ్యలో కలుపుతూ నూనెలో బాగా మగ్గి మెత్తగా అయ్యేంతవరకు ఉడికించాలి. గోంగూర ఉడికిన తర్వాత స్టవ్ ఆపి, చల్లారనివ్వాలి. గోంగూర చల్లారేలోపు, మిక్సీ జార్‌లో కట్ చేసి పెట్టుకున్న పచ్చి దొండకాయ ముక్కలు, తగినంత ఉప్పు వేసి కచ్చాపచ్చాగా గ్రైండ్ చేసుకోవాలి. ఆపై మగ్గించిన గోంగూర మిశ్రమాన్ని వేసి, గరిటెతో కలియతిప్పి, రోటి పచ్చడిలా కచ్చాపచ్చాగా మరోసారి మిక్సీ పట్టుకోవాలి. రోలు అందుబాటులో ఉన్నట్లయితే, ముందుగా దొండకాయలను దంచి, ఆపై గోంగూర మిశ్రమాన్ని వేసి రుబ్బుకోవాలి. ఇలా చేస్తే మిక్సీలో చేసిన పచ్చడి కంటే మరింత రుచికరంగా ఉంటుంది. గ్రైండ్ చేసిన పచ్చడి మిశ్రమాన్ని ఒక బౌల్‌లోకి తీసుకుని సర్వ్ చేసుకోవాలి. ంటలవతీబితిబవఎవనిబి ఇప్పుడు నోరూరించే దొండకాయ గోంగూర పచ్చడి అప్పటికప్పుడు సిద్ధమవుతుంది. వేడి వేడి అన్నంలో కలిపి తింటే దీని రుచి నెక్స్ట్ లెవల్‌లో ఉంటుంది.

# కోడిగుడ్లను రెగ్యులర్ గా తింటున్నారా..అయితే, ఇది తెలుసుకోవాల్సిందే..!!

కోడిగుడ్లల్లో మనకు కావల్సిన విటమిన్లు, ఖనిజ లవణాలు అనేకం ఉంటాయి. శరీరానికి అవసర మయ్యే పోషకాలను అతి తక్కువ ధరలో అందించే ఆహారాల్లో కోడిగుడ్లు కూడా ఒకటి. వీటిని ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. వీటిని తీసుకోవడం వల్ల మెదడు అభివృద్ధి చక్కగా ఉంటుంది. ఇక గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచ డంలో కూడా గుడ్లు మనకు తోడ్పడతాయి. అయితే, కోడిగుడ్లు తినటం పైన కొందరిలో కొన్ని అపోహలు ఉన్నాయి. అసలు రెగ్యలర్ గా తినచ్చా.. ఎన్ని తినాలి.. ఏ సమయంలో తినాలి అనే సందేహాల పైన నిపుణులు స్పష్టత ఇస్తున్నారు. గుండె ఆరోగ్యానికి గుడ్లు మేలు చేసేవే అయినప్పటికీ వీటిని అధికంగా తీసుకోకుండి పరిమితంగా ఆహారంగా మార్చుకుంటే ప్రయోజనం ఉంటుంది. కోడిగుడ్డులో కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటుంది. కోడిగుడ్డులో దాదాపు 180 నుండి 300 మిల్లీ గ్రాముల కొలెస్ట్రాల్ ఉంటుంది. ఇది అంతా కూడా పచ్చసొనలోనే ఉంటుంది. గుడ్డు తెల్లసొనలో కొలెస్ట్రాల్ ఉండదు. గుడ్డు గుండె ఆరోగ్యానికి మేలు చేసేదే అయినప్పటికీ వీటిని అధికంగా తీసుకోవడం వల్ల కొందరికి సమస్యలు వస్తాయి. దీంతో గుండె సమస్యలు ఉన్నవారు మాత్రం వైద్యుడి సలహా మేరకే కోడిగుడ్డు వినియోగించటం మంచిది. ఇక ఈ గుడ్లను చక్కెర, ట్రాన్స్ ఫ్యాట్స్, శుద్ధి చేసిన పిండి వంటి వాటితో కలిపి కేక్స్, కుకీస్ వంటి ఆహారాలను కూడా తయారు చేస్తూ ఉంటారు. దీంతో ఈ క్యాలరీల రేటు మరింత పెరిగి ఆరోగ్యానికి కూడా హాని కలుగుతుంది. దీంతో, గుండెకు మేలు జరగడం పోయి గుండె జబ్బులు, అధిక బరువు, మధుమేహం, శరీరంలో కొలెస్ట్రాల్, ట్రై గ్లిజరాయిడ్ స్థాయిలు పెరగడం వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. కనుక గుడ్లను తగిన మోతాదులో తీసుకోవడం కూడా చాలా అవసరం. కాగా.. ఐసీఎంఆర్, ఎన్ఐఎన్ చెబుతున్న ప్రకారం మనం రోజుకు 300 మిల్లీ గ్రాముల కొలెస్ట్రాల్ కలిగిన ఆహారాలను తీసుకోవచ్చు. ఒక గుడ్డులో దాదాపు 180 నుండి 300 మిల్లీ గ్రాముల కొలెస్ట్రాల్ ఉంటుంది. కనుక మనం వారానికి 3 నుండి 4 గుడ్లను తీసుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. అలాగే గుండె జబ్బులు, అధిక కొలెస్ట్రాల్ స్థాయిలు ఉన్న వారు వారానికి 3 గుడ్లను తీసుకోవచ్చు. ఇక ఈ గుడ్లను వివిధ వంటకాల్లో భాగం చేయడానికి బదులుగా వీటిని నేరుగా ఉడికించి తీసుకున్నప్పుడే మన ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. గుడ్డులోని పోషకాలు మన శరీరానికి చక్కగా అందుతాయి. ఇలా తగిన మోతాదులో ఉడికించి తీసుకున్నప్పుడే గుడ్లు మన ఆరోగ్యానికి మేలు చేస్తాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.



# రూపాయి ఖర్చు లేకుండా అందం కోసం సూపర్ చిట్కా!



ఆరోగ్యంగా, అందంగా ఉండాలని ఎవరు కోరుకోరు. ఎవరైనా సరే అందంగా, ఆనందంగా ఉండాలనే కోరుకుంటారు. భారతీయులు ఇప్పుడు '30 రోజుల వాటర్ ఛాలెంజ్'ను ప్రయత్నిస్తున్నారు. దాని నుండి మంచి ఫలితాలను చూస్తున్నారు. అసలు ఏమిటీ వాటర్ ఛాలెంజ్? ఎందుకు దీనిని ఇప్పుడు ఎక్కువ మంది ట్రై చేస్తున్నారు? అంటే నీరు సరిపడా తాగకుంటే చర్మ ఆరోగ్యానికి హాని నీరు చర్మ ఆరోగ్యానికి ఎంతగానో దోహదం చేస్తాయి అనే విషయం అందరికీ తెలిసిందే . అయితీ నీళ్ళు శరీరానికి కావలసినంత తీసుకోకపోయినా, అవసరం కంటే ఎక్కువ తీసుకున్నా ఇబ్బందే. నీరు శరీరానికి కావాల్సినంత తీసుకోకపోతే అనవసరపు అనారోగ్యం వస్తుంది. అందం కూడా దెబ్బ తింటుంది. ముఖం మీద ముడతలు వచ్చే ప్రమాదం కూడా ఉంది.ముఖంపై పిగ్మెంటేషన్, మొటిమల మచ్చలు, డ్రైస్కిన్ కూడా నీళ్ళు తక్కువగా తీసుకునే వారిలో వస్తాయి. కావాల్సినంత నీరు తాగితే చర్మ ఆరోగ్యం శరీరానికి కావాల్సిన మోతాదులో నీరు తాగడం సాధారణ ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది. సరైన హైడ్రేషన్ చర్మం యొక్క రక్షణపొరను స్థిరంగా ఉంచుతుంది. ఇది చర్మం నిండుగా, కాంతివంతంగా కనిపించేలా చేస్తుంది. పెద్దలకు రోజుకు సుమారు రెండు నుండి మూడు లీటర్ల నీరు అవసరం. శరీర అవసరాన్ని బట్టి నీరు తాగితే చర్మం హైడ్రేటెడ్ గా ఉంటుంది. అయితే అతిగా నీరు తాగడం శరీరలవణాల సమతుల్యత దెబ్బతీసి ఆరోగ్యానికి హానికరం కావచ్చు. ఎక్కువ వాటర్ తాగినా నష్టమే కొన్ని చర్మ సమస్యలు నీరు త్రాగటం కారణంగానే తగ్గకపోవచ్చు కానీ నీరు త్రాగటం చాలా వరకు చర్మ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. త్వరగా వృద్ధాప్యం రాకుండా కాపాడుతుంది. 30 రోజుల వాటర్ ఛాలెంజ్ చేసేవారు కూడా ఒక క్రమ పద్దతిలో నీరు తాగాలి, ఎక్కువగా తాగితే మళ్ళీ ఆరోగ్య నష్టం ఉంటుంది. వాటర్ ఛాలెంజ్ ఇలా చేస్తే బెస్ట్ రిజల్ట్స్ వాటర్ ఛాలెంజ్ లో భాగంగా నెలరోజులు క్రమం తప్పకుండా శరీరాన్ని హైడ్రేట్ చేసేవారు నెలరోజుల ముందు కంటే మెరుగైన కాంతివంతమైన చర్మాన్ని చూస్తారు. అయితే నీరు మన ఆరోగ్య రక్షణలో, చర్మ సంరక్షణలో ఒక భాగమే, మిగతా ఆహారం, నిద్ర, ఒత్తిడి లేని జీవితం ఇవన్నీ భాగం తీసుకుంటాయి.

# ఆలూ క్యాప్సికం కర్రీ.. ఇలా చేస్తే టేస్ట్ నెక్స్ట్ లెవెల్..

ఆలూ, క్యాప్సికం కాంబినేషన్ లో కర్రీ చాలా బాగుంటుంది. ఈ కూర అన్నం, చపాతీలోకి సూపర్ టేస్టీగా ఉంటుంది. చాలా తక్కువ పదార్థాలతో.. సింపుల్ గానే ఈ వంటకాన్ని చేసుకోవచ్చు. మరి ఈ ఆలూ క్యాప్సికం మసాలా కర్రీ తయారీకి కావాల్సిన పదార్థాలు ఏంటి..? తయారీ విధానం ఏంటి..? ఆలూ క్యాప్సికం మసాలా కర్రీ తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే.. ఆలూ నాలుగు, క్యాప్సికం నాలుగు, ఉల్లిగడ్డలు రెండు, పచ్చిమిర్చి నాలుగు లేదా ఐదు, టమాటోలు నాలుగు, నూనె నాలుగు లేదా ఐదు టేబుల్ స్పూన్ లు, పల్లీలు నాలుగు టీ స్పూన్ లు, నువ్వులు, జీలకర్ర ఒక టీ స్పూన్, అల్లం వెల్లుల్లి పేస్టు రెండు టీ స్పూన్ లు, ధనియాల పొడి, గరం మసాలా తగినంత, ఉప్పు సరిపడా, కారం తగినంత, పసుపు చిటికెడు, కొత్తిమీర తరుగు తీసుకోవాలి. క్యాప్సికం ఆలూ కర్రీ తయారీ విధానం చూస్తే.. ముందుగా



బంగాళాదుంపలను తొక్క తీసి కడిగి మీడియం సైజు ముక్కలుగా కట్ చేసుకోవాలి. దాంతోపాటు క్యాప్సికం, ఉల్లిపాయ, టమాటోలను కూడా ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఇప్పుడు స్టవ్ ఆన్ చేసి గిన్నె పెట్టుకోవాలి. అందులో పల్లీలు వేసి తక్కువ మంటమీద గరిటెతో కలుపుతూ వేయించుకోవాలి. అవి వేగిన అనంతరం అందులో తెల్ల నువ్వులు, జీలకర్ర వేసి వేయించుకోవాలి. ఈ మిశ్రమం చల్లారిన తర్వాత మిక్సీలో వేసి మెత్తని పొడిలా గ్రైండింగ్ చేసుకోవాలి ఇప్పుడు స్టవ్ ఆన్ చేసుకుని గిన్నె పెట్టుకోవాలి. నూనే పోయాలి. నూనె వేడెక్కిన తర్వాత అందులో ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి వేసి వేయించుకోవాలి. ఉల్లిపాయలు మగ్గిన తర్వాత అందులో అల్లం పేస్టు వేసి పచ్చివాసన పోయేంత వరకూ వేయించాలి. ఇప్పుడు అందులో ఆలూ ముక్కలు వేసి ఫ్రై చేసుకోవాలి. అవి వేగిన తర్వాత ఆ మిశ్రమంలో క్యాప్సికం ముక్కలు వేసి వేయించాలి. ఆ తర్వాత ఆ మిశ్రమంలోనే టమాటో ముక్కలు వేసి బాగా కలపాలి. ఇప్పుడు అందులో పసుపు, కారం, ధనియాల పొడి, గరం మసాలా, ఉప్పు తగినంత వేసి కలుపుకోవాలి.ఈ మిశ్రమం ఉడికిన తర్వాత అందులో గ్రైండ్ చేసి పెట్టుకున్న పల్లీల మిశ్రమం వేయాలి. ఇప్పుడు గ్రేవీకు సరిపడా నీళ్లు పోసుకోవాలి. అలా ఉడకనివ్వాలి. కర్రీ చక్కగా ఉడుకుతున్న క్రమంలో చివరగా కొత్తిమీర తరుగు వేస్తే సరి. ఘుమఘుమలాడే ఆలూ క్యాప్సికం కర్రీ రెడీ అయినట్టే..

# సూపర్ టేస్టీ రసం రైస్.. ఇలా చేస్తే నిమిషాల్లోనే రెడీ..

చాలామందికి రసం అనగానే నోరూరుతుంది. మిగతా కూరలతో పోల్చితే రసం ఈజీగా చేసుకోవచ్చు. అలాగే జీర్ణం కూడా ఈజీగానే అవుతుంది. అందువల్ల చాలా మంది రసం రైస్ ను చేసుకోవడానికి ఇష్టపడతారు. రసం రైస్ చేసుకుంటే చాలు.. అందులోకి కర్రీ అవసరం లేకుండానే లాగించేయొచ్చు. ఈ రసం రైస్ ను ఎక్కువగా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో పెళ్లిలలో స్పెషల్?గా చేస్తుంటారు. మరి ఈ టేస్టీ రసం రైస్ ను ఎలా తయారు చేసుకోవాలి..? కావాల్సిన పదార్థాలు ఏంటి..? సూపర్ టేస్టీ రసం రైస్ తయారీకి కావాల్సిన పదార్థాలు చూస్తే.. ఒక కప్పు బియ్యం, టమాటో ఒకటి, చింతపండు రసం 50 గ్రాములు, పెసర పప్పు, కంది పప్పు చెరో 2 స్పూన్ లు, రుచికి సరిపడా ఉప్పు, నెయ్యి 2 స్పూన్ లు, ఇంగువా చిటికెడు, ఆవాలు ఒక స్పూన్, రెండు ఎండు మిర్చి, రెండు పచ్చిమిర్చి, జీలకర్ర టీ స్పూన్, కరివేపాకు, కొత్తిమీర కొద్దిగా తీసుకోవాలి. మరిన్ని కనుగొనండి బియ్యం టమాటో టమాటా కూర తీతిఇవ జీలకర్ర కర్రీ కొత్తిమీర క్రీడా వార్తా సేవలు" రసం రైస్ తయారీ విధానం చూస్తే.. ముందుగా బియ్యం కడిగి గంటపాటు



నానబెట్టుకోవాలి. అలాగే పెసరపప్పు, కంది పప్పును కూడా గంట పాటు నానబెట్టుకోవాలి. ఇప్పుడు స్టవ్ వెలిగించి కుక్కర్ పెట్టి అందులో నానబెట్టిన బియ్యం, పెసరపప్పు, కంది పప్పు, పసుపు, టమాటా ముక్కలు, నీళ్లు పోయాలి. నాలుగు విజిల్స్ వచ్చేంత వరకూ ఉడికించుకోవాలి. ఇప్పుడు స్టవ్ ఆఫ్ చేసుకోవాలి. ఆ తర్వాత మరో గిన్నెలో చింతపండు పులుసు, రసం పొడి, ఉప్పు వేసి బాగా కలుపుకోవాలి. ఇప్పుడు కుక్కర్ మూత తీసి ఉడికిన అన్నంలో ఈ మిశ్రమం.. కొద్దిగా నీళ్లు పోసి బాగా కలిపేసుకోవాలి. ఇప్పుడ స్టౌ మీద మరో గిన్నె పెట్టుకుని తాలింపు చేసుకోవాలి. తాలింపు కోసం నెయ్యి వేసి అందులో ఇంగువా, ఆవాలు వేసి కలుపుకోవాలి. ఇప్పుడు ఇందులోనే ఎండు మిర్చి, పచ్చిమిర్చి, జీలకర్ర, కరివేపాకు వేసి తాళింపును ఎర్రగా వేయించుకోవాలి. ఆ మిశ్రమాన్ని అన్నంపై పోయాలి. ఇప్పుడు కొత్తిమీర తరుగు వేస్తే సరి సూపర్ టేస్టీ రసం రైస్ రెడీ అయినట్టే..

# స్పోర్ట్స్ న్యూస్

## 6 బంతుల్లో.. 6 సిక్స్‌లు జస్ట్‌మిస్! హార్దిక్ పాండ్యా ఊచకోత

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా తృటిలో వరల్డ్ రికార్డ్ చేజార్చుకున్నాడు. క్రికెట్ చరిత్రలోనే అత్యంత అరుదైన 6 బంతుల్లో 6 సిక్స్‌ల రికార్డ్‌ను 2 పరుగుల దూరంలో కోల్పోయాడు. ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో బరోడా తరఫున బరిలోకి దిగిన హార్దిక్ పాండ్యా.. ఎలైట్ గ్రూప్-బీలో భాగంగా రాజ్‌కోట్ వేదికగా విదర్భతో జరిగిన మ్యాచ్‌లో సెంచరీతో చెలరేగాడు. ఇది హార్దిక్ పాండ్యాకు తొలి లిస్ట్-ఏ సెంచరీ. ఈ మ్యాచ్‌లో ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన హార్దిక్ పాండ్యా మొత్తం 92 బంతులు ఆడి 8 ఫోర్లు, 11 సిక్స్‌లతో 133 పరుగులు




చేశాడు.విదర్భ లెఫ్టార్మ్ స్పిన్నర్ పార్థ్ రేఖడే వేసిన 39వ ఓవర్‌లో హార్దిక్ పాండ్యా వరుసగా ఐదు సిక్స్‌లు, ఓ బౌండరీ బాది 68 బంతుల్లో శతకం సాధించాడు. ఈ ఓవర్‌లో వరుసగా 5 సిక్స్‌లు బాదిన హార్దిక్ పాండ్యా.. ఆఖరి బంతిని కూడా సిక్స్ బాదేలా కనిపించాడు. కానీ పార్థ్ రేఖడే తెలివిగా బౌలింగ్ చేయడంతో స్ట్రైట్ డ్రైవ్ షాట్ ఆడాడు. ఈ బంతి కూడా బౌండరీకి వెళ్లినా.. 6 బంతుల్లో 6 సిక్స్‌ల రికార్డ్ మాత్రం చేజారింది. ఈ ఒక్క ఓవర్‌లోనే హార్దిక్ పాండ్యా 34 పరుగులు పిండుకున్నాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.భారత్ తరఫున 6 బంతుల్లో 6 సిక్స్‌లు కొట్టిన రికార్డ్ యువరాజ్ సింగ్, రవి శాస్త్రి, రుతురాజ్ గైక్వాడ్‌లపేరిట ఉంది. యువరాజ్ సింగ్ అంతర్జాతీయ టీ20ల్లో ఇంగ్లండ్‌పై అరంగేట్ర టీ20 ప్రపంచకప్‌లో ఈ ఫీట్ సాధించగా.. రవి శాస్త్రి రంజీల్లో ఈ ఘనతను అందుకున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో 2022లోనే రుతురాజ్ గైక్వాడ్ ఒకే ఓవర్‌లో 7 సిక్స్‌లు బాదాడు. మరో సిక్స్ బాది ఉంటే ఈ అరుదైన జాబితాలోకి హార్దిక్ పాండ్యా కూడా రీఎంట్రీ ఇచ్చేవాడు.ఈ మ్యాచ్‌లో 71 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడ్డ బరోడాను హార్దిక్ పాండ్యా ఆదుకున్నాడు. తన అన్న కృనాల్ పాండ్యా(50 బంతుల్లో 23), విష్ణు సోలంకి(17 బంతుల్లో 26) సాయంతో జట్టును గట్టెక్కించాడు. దాంతో ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన బరోడా 50 ఓవర్లలో 9 వికెట్లకు 293 పరుగుల భారీ స్కోర్ చేసింది.

## ముస్తాఫిజుర్‌పై బీసీసీఐ వేటు.. కేకేఆర్ రియాక్షన్ ఇదే!

బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను జట్టు నుంచి రిలీజ్ చేయాలని బీసీసీఐ ఆదేశించిన నేపథ్యంలో కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) స్పందించింది. బీసీసీఐ మాటే తమ వేదమని, ఇప్పటికే ముస్తాఫిజుర్‌ను రిలీజ్ చేసే ప్రక్రియ పూర్తయిందని తెలిపింది.బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో ఐపీఎల్ ఆడకుండా ముస్తాఫిజుర్‌పై నిషేధం విధించాలని దేశవ్యాప్తండా డిమాండ్ వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. పలు రాజకీయ పార్టీలు సైతం ముస్తాఫిజుర్‌ను వదిలేయాలని కేకేఆర్‌ను బహిరంగంగా హెచ్చరించాయి. ఈ క్రమంలోనే అతన్ని జట్టు నుంచి వదిలేయాలని కేకేఆర్‌కు బీసీసీఐ సూచించింది. బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియానే ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించారు. దేశ ప్రజల డిమాండ్, రాజకీయ ఒత్తిళ్ల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశారు.ముందుగా ఈ విషయంలో వేచి చూసే ధోరణిని అవలంబించినప్పటికీ.. ప్రస్తుతం చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. 'ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో బంగ్లాదేశ్ క్రికెటర్ ముస్తాఫిజుర్ రెహమాన్‌ను విడుదల చేయాలని కేకేఆర్ ఫ్రాంచైజీని బీసీసీఐ ఆదేశించింది. అతని స్థానంలో కేకేఆర్ మరో ప్రత్యామ్నాయ ఆటగాడిని కోరుకుంటే.. అందుకు బీసీసీఐ అనమతి ఇస్తుంది.'అని ఏఎన్ఐతో సైకియా అన్నారు.కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) ఫ్రాంచైజీ సైతం ఈ విషయాన్ని ధృవీకరిస్తూ ఓ ప్రకటనను విడుదల చేసింది. 'అప్‌కమింగ్ ఐపీఎల్ 2026 సీజన్‌కు ముందే మా జట్టు నుంచి బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను రిలీజ్ చేయాలని బీసీసీఐ మాకు ఆదేశాలు జారీ చేసింది. బీసీసీఐ సూచనల మేరకు, తగిన సంప్రదింపుల తర్వాత నిబంధనల ప్రకారమే ఈ విడుదల ప్రక్రియను పూర్తి చేశాం. ఐపీఎల్ రూల్స్‌కు అనుగుణంగా.. ముస్తాఫిజుర్ స్థానంలో మరొక ఆటగాడిని తీసుకోవడానికి బీసీసీఐ... కేకేఆర్‌కు అనుమతి ఇచ్చింది. రిప్లేస్‌మెంట్‌కు సంబంధించిన వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం.'అని కేకేఆర్ మేనేజ్‌మెంట్ తమ ప్రకటనలో పేర్కొంది.ఐపీఎల్ 2026 మినీ వేలంలో ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను కేకేఆర్ రూ.9.2 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. చెన్నై సూపర్ కింగ్స్‌తో పోటీ పడి మరీ భారీ ధరకు దక్కించుకుంది. దాంతో ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక ధర పలికిన బంగ్లా ఆటగాడిగా ముస్తాఫిజుర్ నిలిచాడు. కానీ బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిణామాల నేపథ్యంలో కేకేఆర్ ముస్తాఫిజుర్ సేవలను కోల్పోవాల్సి వచ్చింది. ఇది ఆ జట్టుకు తీవ్ర నష్టం చేయనుంది.




## టీమిండియా బ్యాటర్‌కు తీవ్ర గాయం.. 6 వారాలు దూరం!

టీమిండియా స్టార్ బ్యాటర్ సాయి సుదర్శన్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో తమిళనాడు తరఫున బరిలోకి దిగిన సాయి సుదర్శన్.. మధ్యప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో తీవ్రంగా గాయపడ్డాడు. బ్యాటింగ్ సమయంలో తన హాఫ్ సెంచరీ పూర్తి చేసే క్రమంలో పరుగు కోసం డైవ్ చేసినప్పుడు సాయి సుదర్శన్ గాయపడ్డాడు.వెంటనే ఫిజియోలు అతన్ని హుటాహుటినా బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు తరలించారు. అక్కడ అతనికి స్కానింగ్ తీయగా.. కుడి వైపు ఏడవ పక్కటెముక ముందు భాగంలో చిన్నపాటి చీలిక ఉన్నట్లు తేలింది. విజయ్ హజారే ట్రోఫీ ప్రారంభంలో నెట్ ప్రాక్టీస్ సమయంలో కూడా సాయి సుదర్శన్‌కు సరిగ్గా అదే చోట దెబ్బ తగిలింది.సాధారణంగా ఈ గాయం నుంచి కోలుకోవడానికి 6-8 వారాల సమయం పడుతుంది. దాంతో విజయ్ హజారే ట్రోఫీలతో పాటు రంజీ సీజన్ మిగిలిన మ్యాచ్‌లకు దూరం కానున్న ఈ 24 ఏళ్ల క్రికెటర్.. ఐపీఎల్ 2026 సీజన్‌తో రీఎంట్రీ ఇచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం సాయి సుదర్శన్..బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో రిహాబిలిటేషన్ తీసుకుంటున్నాడు.'గాయం నుంచి త్వరగా కోలుకోవడానికి సాయి సుదర్శన్ లోయర్ బాడీ స్ట్రెంగ్త్ అండ్ కండిషనింగ్ ట్రైనింగ్ తీసుకుంటున్నాడు. ఈ వ్యాయమానికి శరీరం బాగా సహకరిస్తోంది. వచ్చే ఏడు నుంచి పది రోజుల్లో నొప్పి తగ్గిన తర్వాత అప్పర్ బాడీ ట్రైనింగ్ ప్రారంభిస్తాం. ఆ తర్వాత క్రమంగా పూర్తి స్థాయి శిక్షణను అందిస్తాం.'అని సీఓఈ పేర్కొంది.గతేడాది భారత్ తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసిన సాయి సుదర్శన్.. ఇప్పటి వరకు 6 టెస్ట్‌ల్లో 27.45 సగటుతో 302 పరుగులు చేశారు. అలాగే మూడు వన్డేలు, ఒక టీ20 మ్యాచ్ కూడా ఆడాడు. ప్రస్తుతం తమిళనాడు జట్టు తన గ్రూప్‌లో నాలుగు మ్యాచ్‌ల్లో ఒక విజయంతో ఆరో స్థానంలో కొనసాగుతుంది. తదుపరి మ్యాచ్‌ల్లో రాజస్థాన్, త్రిపుర, కేరళతో తలపడనుంది.



## టీమిండియాకు గుడ్ న్యూస్.. అతని రీఎంట్రీకి ముహూర్తం ఫిక్స్!



టీమిండియా ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్. భారత వన్డే వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ రీఎంట్రీకి ముహూర్తం ఖరారైంది. ఆస్ట్రేలియా పర్యటనలో ఫీల్డింగ్ చేస్తూ శ్రేయస్ అయ్యర్ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. అతని పక్కటెముకల్లోని ప్లీహంలో చీలిక రావడంతో పాటు అంతర్గత రక్త స్రావం కావడంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. భారత ఫిజియోల వేగవంతమైన ట్రీట్‌మెంట్‌తో శ్రేయస్ అయ్యర్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అనంతరం ఇంటికే పరిమితమైన శ్రేయస్ అయ్యర్.. ఇటీవలే బెంగళూరులోని బీసీసీఐ సెంట్రల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో చేరి ఫిట్‌నెస్‌పై ఫోకస్ పెట్టాడు. ఈ గాయంతో మూడు నెలల పాటు పూర్తిగా ప్రొఫెషనల్ క్రికెట్‌కు దూరమైన శ్రేయస్ అయ్యర్.. విజయ్ హజారే ట్రోఫీతో తిరిగి మైదానంలోకి అడుగుపెట్టనున్నాడు.ఈ టోర్నీలో భాగంగా జనవరి 6న హిమాచల్ ప్రదేశ్‌తో జరిగే మ్యాచ్‌లో ముంబై తరఫున శ్రేయస్ అయ్యర్ బరిలోకి దిగుతాడని బీసీసీఐ సీఓఈకి చెందిన ఓ అధికారి మీడియాకు తెలిపాడు. అయితే, న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో ఆడుతాడా? లేదా అనేది అతని ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉంటుందని చెప్పాడు.'శ్రేయస్ అయ్యర్ శుక్రవారం(జనవరి 2) తన మొదటి 50-ఓవర్ల 'రిటర్న్ టు ప్లే' మ్యాచ్‌ను విజయవంతంగా పూర్తి చేశాడు. ఫిట్‌నెస్ క్లియరెన్స్ పొందడానికి ముందు అతను జనవరి 6న రెండో రిటర్న్ టు ప్లే మ్యాచ్‌గా విజయ్ హజారే ట్రోఫీ ఆడనున్నాడు.'అని సదరు అధికారి వెల్లడించాడు. ఈ మ్యాచ్‌లో అయ్యర్ ఫిట్‌నెస్ నిరూపించుకుంటే భారత జట్టులోకి రీఎంట్రీ ఇవ్వనున్నాడు. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్ జనవరి 11న ప్రారంభం కానుంది. ఈ సిరీస్ ఆడే భారత జట్టును బీసీసీఐ ఇంకా ప్రకటించలేదు. శనివారం ప్రకటిస్తామని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా తెలిపారు.ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన భారత జట్టులో సభ్యుడిగా ఉన్న శ్రేయస్ అయ్యర్ అద్భుతమైన ప్రదర్శన కనబర్చాడు. భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఈ ప్రదర్శన నేపథ్యంలోనే అతనికి వన్డే వైస్ కెప్టెన్సీ బాధ్యతలు దక్కాయి. అయ్యర్.. న్యూజిలాండ్‌తో సిరీస్‌కు ఎంపికవ్వకపోతే ఐపీఎల్ 2026లో బరిలోకి దిగనున్నాడు. ఎందుకంటే న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్‌తో పాటు టీ20 ప్రపంచకప్ 2026 జట్టులో అతనికి చోటు దక్కలేదు. కేవలం అతను వన్డే ఫార్మాట్ మాత్రమే ఆడుతున్నాడు.

## ఐదు మ్యాచ్‌ల్లో 4 సెంచరీలు.. ఆర్‌సీబీ బ్యాటర్ ఊచకోత!



దేశవాళీ క్రికెట్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) బ్యాటర్ దేవదత్ పడిక్కల్ దుమ్మురేపుతున్నాడు. ప్రతిష్టాత్మక దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో కర్ణాటకకు ప్రాతినిథ్యం వహిస్తున్న పడిక్కల్.. వరుసగా ఐదు ఇన్నింగ్స్‌ల్లో 4 శతకాలు నమోదు చేశాడు.ఎలైట్ గ్రూప్-ఏలో భాగంగా త్రిపురతో శనివారం అహ్మదాబాద్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో దేవదత్ పడిక్కల్ సెంచరీతో చెలరేగాడు. ఈ మ్యాచ్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన పడిక్కల్ 120 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 108 పరుగులు చేశాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో పడిక్కల్‌కు ఇది 13వ శతకం. పడిక్కల్ శతకానికి తోడుగా రవిచంద్రన్ సమరణ్(60), అభినవ్ హనోహర్(79) హాఫ్ సెంచరీలతో రాణించడంతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 332 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్(35) నిరాశపర్చాడు.విజయ్ హజారే ట్రోఫీలో జార్ఖండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 147 పరుగులు చేసిన పడిక్కల్.. కేరళతో 124 పరుగులు చేశాడు. పాండిచ్చేరిపై 113 పరుగులు చేసిన అతను తమిళనాడుపై మాత్రం విఫలమయ్యాడు. ఈ మ్యాచ్‌లో 22 పరుగులే చేశాడు. తాజాగా త్రిపురపై సెంచరీ బాది.. తన నిలకడను చూపించాడు. ఓవరాల్‌గా 5 మ్యాచ్‌ల్లోనే 513 పరుగులు చేసి సెలెక్టర్లకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చాడు.ప్రస్తుతం సూపర్ ఫామ్‌లో ఉన్న దేవదత్ పడిక్కల్‌ను న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌కు ఎంపిక చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. నెటిజన్లు కూడా పడిక్కల్‌కు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఐపీఎల్‌లో పడిక్కల్ ఆర్‌సీబీకి ప్రాతినిథ్యం వహిస్తున్న విషయం తెలిసిందే. అతని సూపర్ ఫామ్ నేపథ్యంలో ఆర్‌సీబీ ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్ ఆడే భారత జట్టును ఈ రోజు(శనివారం) ప్రకటిస్తామని బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా తెలిపాడు. 'జనవరి 11 నుంచి న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ రోజు మేం సెలెక్టర్లతో మధ్యాహ్నం సమావేశం అవుతున్నాం. ఆ సమావేశం అనంతరం న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ ఆడే భారత జట్టును ప్రకటిస్తాం.'అని సైకియా పేర్కొన్నారు. ఈ జట్టులో పడిక్కల్‌కు అవకాశం దక్కుతుందో లేదో చూడాలి.

## ఒకే ఓవర్‌లో ఆరు సిక్సులు.. జస్ట్ మిస్.. హార్ధిక్ విధ్వంసం

రాజ్‌కోట్: ప్రస్తుతం జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో టీం ఇండియా స్టార్లు కూడా పాల్గొంటున్నారు. బిసిసిఐ మార్గదర్శకాల మేరకు వీరు ఈ మ్యాచ్‌లు ఆడుతున్నారు. తాజాగా స్టార్ ఆల్ రౌండర్ హార్థిక్ పాండ్యా కూడా బరోడా తరఫున బరిలోకి దిగాడు. విదర్భతో ప్రస్తుతం జరుగుతున్న మ్యాచ్‌లో అద్భుతమైన శతకంతో చెలరేగిపోయాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన విదర్భ జట్టు బరోడాను బ్యాటింగ్‌కి ఆహ్వానించింది. దీంతో తొలుత బ్యాటింగ్‌కి దిగిన బరోడా టాప్ ఆర్డర్ ఫెయిల్ అయింది. 71 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ నేపథ్యంలో హార్థిక్ పాండ్యా తన సోదరుడు కృనాల్‌తో కలిసి స్కోర్ పెంచే ప్రయత్నం చేశాడు. కానీ, కృనాల్(23) కూడా నిరాశపరిచాడు.ఈ నేపథ్యంలో హార్థిక్ పట్టువదలకుండా బ్యాటింగ్ చేశాడు. 68 బంతుల్లోనే సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. అంతకు ముందు ఒకే ఓవర్‌లో వరుసగా ఐదు సిక్సులు, ఒక ఫోర్ బాది.. ఒకే ఓవర్‌లో ఆరు సిక్సులు కొట్టా ఛాన్స్‌ని తృటిలో చేజార్చుకున్నాడు. మొత్తంగా 92 బంతుల్లో 8 ఫోర్లు 11 సిక్సులతో 133 పరుగులు చేశాడు. దీంతో బరోడా 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 293 పరుగులు చేసింది. కానీ, విదర్భ బ్యాటర్లు ఈ లక్ష్యాన్ని చేరుకోవడంతో మరికొంత దూరంలోనే ఉన్నారు. ఓపెనర్ అథర్వ టైడ్(65) అర్ధశతకంతో రాణించి ఔట్ కాగా, మరో ఓపెనర్ అమన్ (117) అద్భుత శతకంతో దూసుకెళ్తున్నాడు. ఇక ధ్రువ్ షోరే కూడా అర్ధ శతకం సాధించి జట్టుకు విజయాన్ని అందించడానికి కృషి చేస్తున్నాడు. ప్రస్తుతం 38 ఓవర్లు ముగిసేసరికి విదర్భ 1 వికెట్ నష్టానికి 256 పరుగులు చేసింది.




# శంకర వరప్రసాద్ కోసం 'పెద్ది' త్యాగం...!

కొత్త ఏడాది సందర్భంగా ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న చాలా సినిమాలకు సంబంధించిన పోస్టర్స్, టీజర్స్, ఇంకా రకరకాల ప్రమోషన్ స్టఫ్ ను విడుదల చేయడం జరిగింది. కొత్త సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేస్తూ పలు పోస్టర్స్ వచ్చాయి. కానీ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో



రూపొందుతున్న పెద్ది సినిమాకు సంబంధించి ఎలాంటి అప్‌డేట్ రాలేదు. కనీసం రామ్ చరణ్ కొత్త పోస్టర్ వస్తుందని అంతా ఆశించారు. కానీ రామ్ చరణ్ అభిమానులు నిరుత్సాహం వ్యక్తం చేసే విధంగా సినిమా పోస్టర్ కాదు కదా కనీసం చిన్న అప్‌డేట్ కూడా ఇవ్వలేదు. దాంతో మెగా ఫ్యాన్స్ ముఖ్యంగా చరణ్ ఫ్యాన్స్ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే సినిమా పూర్తి చేసిన బుచ్చిబాబు ప్రమోషన్ విషయంలో నెమ్మదిగా ఉండటం ఏమాత్రం కరెక్ట్ కాదంటూ చాలా మంది విమర్శిస్తున్నారు. అయితే కొత్త సంవత్సరం కానుక రాకపోవడం వెనుక వేరే కారణం ఉందని తెలుస్తోంది.మన శంకరవరప్రసాద్ గారు సినిమా సంక్రాంతికి... ఈ సంక్రాంతికి మెగాస్టార్ చిరంజీవి నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాను విడుదల చేయబోతున్నారు. విడుదల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున ప్రమోషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొత్త ఏడాదిలోనూ ఆ సినిమా నుంచి వరుస ప్రమోషనల్ వీడియోలు, ఫోటోలు వచ్చాయి. ఇలాంటి సమయంలో శంకర వరప్రసాద్ నుంచి ప్రేక్షకుల దృష్టిని మరల్చడం ఇష్టం లేకపోవడం వల్లే పెద్ది నుంచి ఎలాంటి అప్‌డేట్ రాలేదు అనేది ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న టాక్. కొత్త సంవత్సరం అనేది ఖచ్చితంగా చాలా ముఖ్యమైన సందర్భం అనడంలో సందేహం లేదు. అలాంటి సందర్భంలో సినిమా నుంచి పోస్టర్‌ను విడుదల చేస్తే కచ్చితంగా మంచి రీచ్ ఉంటుంది. అయినా కూడా మెగాస్టార్ కోసం మెగా పవర్ స్టార్ సినిమా ను కాస్త సైలెంట్ చేసి పెట్టారు. ఎప్పుడైతే మన శంకరవర ప్రసాద్ గారు బయటకు వస్తారో అప్పటి నుంచి పెద్ది సందడి షురూ అయ్యే అవకాశం రామ్ చరణ్ పెద్ది సినిమాను సమ్మర్‌లో... కొత్త సంవత్సరం సందర్భంగా పెద్ది త్యాగం చేసి మొత్తం స్పేస్ ను మన శంకరవర ప్రసాద్ గారు కి ఇచ్చాడు అనేది చాలా మంది అంటున్న మాట. తండ్రి సినిమా కోసం రామ్ చరణ్ తన పెద్ది సినిమాను కాస్త సైలెంట్ చేశాడు అంతే. అయితే పెద్దికి ఉన్న స్టామినా నేపథ్యంలో విడుదలకు రెండు మూడు వారాల ముందు ప్రమోషన్ మొదలు పెట్టినా కచ్చితంగా రీచ్ విపరీతంగా దక్కే అవకాశం ఉంది. ఇప్పటికే వచ్చిన పాట ఓ రేంజ్ లో హిట్ అయింది. వెంటనే మరో పాటను విడుదల చేయాల్సి ఉన్నా మన శంకర వరప్రసాద్ ప్రమోషన్ కి అడ్డు అనే ఉద్దేశంతోనూ పాటను వాయిదా వేశారని తెలుస్తోంది. మొత్తానికి శంకర వరప్రసాద్ కోసం పెద్ది చాలా త్యాగం అయితే చేస్తున్నాడు. అందుకు తగ్గట్లుగానే అనిల్ రావిపూడి జోరు మీద ఉండి ప్రమోషన్ చేస్తున్నాడు. తాజాగా నయనతార సైతం కెమెరా ముందుకు వచ్చి ప్రమోషన్ వీడియోలో కనిపించింది. రామ్ చరణ్, బుచ్చిబాబు కాంబోలో రూపొందుతున్న పెద్ది సినిమాపై ఉన్న అంచనాల నేపథ్యంలో సమ్మర్ లో భారీ ఎత్తున విడుదల చేయడం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. బుచ్చిబాబు దర్శకుడిగా ఇది రెండో సినిమానే అయినా కూడా అద్భుతంగా చిత్రీకరించాడు అంటూ మేకర్స్ చెబుతున్నారు. రంగస్థలం తర్వాత చరణ్ నుంచి ఆ స్థాయి సినిమా గా ఈ సినిమా నిలుస్తుందని అంతా నమ్మకంగా ఉన్నారు. 2026 లో చరణ్ తో పాటు బుచ్చిబాబుకు బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ దక్కుతుందని మెగా ఫ్యాన్స్ నమ్మకంగా ఉన్నారు. ఇక ఈ సంక్రాంతికి మన శంకర వరప్రసాద్ గారు సినిమా రానున్న నేపథ్యంలో చిరంజీవి ఈ ఏడాదిని చాలా గ్రాండ్ గా ఆరంభించి, ముందు ముందు రాబోతున్న మెగా సినిమాలకు బూస్ట్‌గా నిలుస్తారని అంతా నమ్మకంగా ఉన్నారు. తండ్రి కొడుకులు ఇద్దరూ ఈ ఏడాది భారీ హిట్స్ కొట్టాలని మెగా ఫ్యాన్స్ బలంగా కోరుకుంటున్నారు. మరి మన శంకరవరప్రసాద్ గారు, పెద్ది సినిమాలు ఎలా ప్రేక్షకులను మెప్పిస్తాయి, ఎంత మేరకు వసూళ్లు రాబడుతాయి అనేది చూడాలి.



# సూపర్‌స్టార్ సన్ లైఫ్ క్రేజీ హీరోయిన్ చేతిలో!

సినిమా ఇండస్ట్రీలో ఎంత ఫ్యామిలీ బ్యాగ్రౌండ్, సపోర్ట్ ఉన్నా కానీ ఆవగింజంత అదృష్టం, టన్నుల కొద్దీ టాలెంట్ ఉండాల్సిందే. ఆ రెండూ లుకుండా..కేవలం ఫ్యామిలీ బ్యాగ్రౌండ్ మాత్రమే ఉన్న వారు ఇండస్ట్రీలో నిలబడలేకపోయారన్నది చరిత్ర చెప్పిన సత్యం. ఆ విషయాన్ని పరిగణలోకి తీసుకుని ఫ్యామిలీ బ్యాగ్రౌండ్ ఉన్నా కానీ టాలెంట్‌ని, అదృష్టాన్ని నమ్ముకున్న వాళ్లు ఇండస్ట్రీలో స్టార్స్‌గా ఎదిగారు. ఇప్పుడు అదే ఫార్ములాని బాలీవుడ్ మిస్టర్ పర్‌ఫెక్ట్ ఆమిర్ ఖాన్ వారసుడి కోసం ఫాలో అవుతున్నారు. అందు కోసం క్రేజీ హీరోయిన్ సాయి పల్లవినే నమ్ముకోవడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. బాలీవుడ్ మిస్టర్ పర్‌ఫెక్ట్‌గా పేరు తెచ్చుకున్న ఆమిర్ ఖాన్ తన వారసుడు జునైద్ ఖాన్‌ని హీరోగా నిలబెట్టాలని ప్రయత్నాలు చేస్తున్నాడు. అయితే తన ప్రయత్నాలేవీ పెద్దగా ఫలించడం లేదు. 2014లో 'పీకే' మూవీతో అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్ ప్రారంభించిన జునైద్ ఖాన్ ..విద్యాబాలన్, షఫాలీషా ప్రధాన పాత్రల్లో నటించిన 'జల్సా'లో యాక్టింగ్ డెబ్యూగా ఎంట్రీ ఇచ్చాడు. ఇందులో తనది కేవలం సపోర్టింగ్ రోల్ మాత్రమే. 2024లో సిద్ధార్థ్ మల్హోత్రా డైరెక్ట్ చేసిన హిస్టారిక్ డ్రామా 'మహారాజ్'తో లీడ్ యాక్టర్‌గా అరంగేట్రం చేశాడు. 'అర్జున్‌రెడ్డి' ఫేమ్ షాలిని పాండే, షార్వరీ హీరోయిన్‌లుగా నటించిన ఈ మూవీపై హిందూ సంఘాలు అభ్యంతరం తెలపడంతో వివాదం తలెత్తింది. దీంతో గుజరాత్ హైకోర్టు రిలీజ్‌ను నిలిపివేసింది. థియేటర్లలో రిలీజ్ కాలేకపోయిన ఈ మూవీని ఫైనల్‌గా నెట్‌ఫ్లిక్స్‌లో రిలీజ్ చేశారు. వారసుడి అరంగేట్రానికి సంబంధించిన సినిమా వివాదాల నడుమ ఓటీటీలో రిలీజ్ కావడంతో ఆమిర్‌ఖాన్ తన తనయుడి కెరీర్‌ని పట్టాలెక్కించడానికి ఫైనల్‌గా సాయి పల్లవి నమ్ముకున్నాడు. జులైద్ ఖాన్ హీరోగా సాయి పల్లవి హీరోయిన్ రూపొందుతున్న లేటెస్ట్ మూవీ 'మేరే రహో'. సునీల్ పాండే డైరెక్ట్ చేస్తున్న ఈ రొమాంటిక్ లవ్ డ్రామాని ఆమిర్‌ఖాన్ స్వయంగా నిర్మిస్తున్నాడు. జపాన్‌లోని సప్పొరో సిటీలో మేజర్ పార్ట్ షూటింగ్ జరుపుకున్న ఈ మూవీ షూటింగ్ పూర్తయి దాదాపు ఏడాది కావస్తున్న రిలీజ్‌కు నోచుకోవడం లేదు. కారణం పలు క్రేజీ సినిమాల రిలీజ్‌లు ఉండటం, వాటి మధ్య రిలీజ్ చేసి జునైద్ కెరీర్‌ని రిస్క్‌లో పెట్టడం ఇష్టంలేక ఆమిర్ ఈ మూవీ రిలీజ్‌ని ఆపుతూ వస్తున్నాడు. ఫైనల్‌గా వేసవిలో విడుదల చేయాలని ప్లాన్ చేసుకుంటున్నారు. సాయి పల్లవి క్రేజ్ ఈ సినిమాకు ప్లాస్ కానుండటంతో ఆమిర్‌ఖాన్ ఆశలన్నీ తనపైనే పెట్టుకున్నాడట. తన క్రేజ్ తన తనయుడికి తొలి హిట్‌ని అందిస్తుందని భావించి హీరోయిన్‌గా సాయి పల్లవిని తీసుకున్నారని బాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తోంది. అంటే ఆమిర్‌ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ కెరీర్ సాయి పల్లవి చేతిలో ఉందన్నమాట.



# అఖండ 2: బోయపాటి చెప్పిన దాంట్లో అసలు నిజముందా?

టాలీవుడ్ సీనియర్ హీరో నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్ లో రూపొందిన అఖండ 2 తాండవం మూవీ రీసెంట్ గా రిలీజైన విషయం తెలిసిందే. సనాతన ధర్మం, దైవిక అంశాలతో తెరకెక్కిన ఆ చిత్రం.. డిసెంబర్ 12వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చింది. పాన్ ఇండియా రేంజ్ లో థియేటర్స్ లో రిలీజైంది. బ్లాక్ బస్టర్ హిట్ మూవీ అఖండకు సీక్వెల్ గా తెరకెక్కడంతో అఖండ 2 తాండవంపై ఆడియన్స్ లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కచ్చితంగా భారీ హిట్ గా నిలుస్తుందని అంతా ఫిక్స్ అయ్యారు. కానీ సినిమా రిలీజ్ అయ్యాక కంటెంట్ అందరినీ ఆకట్టుకోలేదు. కేవలం అభిమానులను విశేషంగా మెప్పించింది. కానీ కామన్ ఆడియన్స్ ను అనుకున్నంత రేంజ్ లో అట్రాక్ట్ చేయలేదు. దీంతో సినిమా వసూళ్లపై అందరి ఫోకస్ పడింది. ఓపెనింగ్స్ తో పాటు మొదటి కొన్ని రోజుల పాటు మంచి వసూళ్లు రావడంతో.. మూవీ రూ.100 కోట్ల క్లబ్ లోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత కలెక్షన్లు డ్రాప్ అవుతుండడంతో బ్రేక్ ఈవెన్ ను కంప్లీట్ చేయడం కష్టమేనని చెప్పాలి. ఇంతలో బోయపాటి శ్రీను.. ఏకంగా సినిమాకు సంబంధించిన డబ్బులు మొత్తం వచ్చేశాయని ఇటీవల తెలిపారు. అఖండ 2ను బిజినెస్ కోణంలో చూడకూడదని అన్నారు. డబ్బుకు ఎలాంటి సమస్య లేదని, పెట్టిన పెట్టుబడి ఇప్పటికే తిరిగి వచ్చేసిందని ఆయన చెప్పారు. ఇంకేముంది.. బాలయ్య అభిమానులు సోషల్ మీడియాలో దాన్ని వైరల్ చేశారు. కానీ బోయపాటి చెప్పిన దాంట్లో నిజమెంత అనేది ఎవరికీ తెలియదు. ఎందుకంటే డైరెక్టర్ కామెంట్స్ కు.. బయ్యర్ల ప్రస్తుత వాస్తవ పరిస్థితికి చాలా తేడా ఉంది. అనేక మంది బయ్యర్లు భారీ నష్టాలను



చవి చూశారని సమాచారం. ముఖ్యంగా వైజాగ్ కొనుగోలుదారు సతీష్.. అఖండ 2కి గాను సుమారు రూ.6 కోట్ల నష్టపోయినట్లు వార్తలు వస్తున్నాయి. గుంటూరు బయ్యర్ వెంకట్ సుమారు రూ.3 కోట్లు నష్టపోయినట్లు సమాచారం. కృష్ణా జిల్లా బయ్యర్ సాయి కొర్రపాటి దాదాపు రూ.3 కోట్లు నష్టపోగా, తూర్పు గోదావరి బయ్యర్ విజయలక్ష్మి ఫిల్మ్స్ సుమారు రూ.4 కోట్ల నష్టాలను ఎదుర్కొన్నట్లు తెలిసింది. నైజాం తప్ప అన్ని ప్రాంతాల్లో కూడా సినిమాకు భారీ నష్టాలు వచ్చాయని టాక్. దీంతో వారంతా ఇప్పుడు మేకర్స్ జీఎస్టీ రీఫండ్ లు ఇస్తారని ఎదురుచూస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. వాటి వల్ల బయ్యర్స్ కు నష్టాలు కొంత వరకు తగ్గే అవకాశం ఉంది. ఏదేమైనా ఇప్పటికే నష్టాలు వచ్చి బాధపడుతున్నట్లు తెలుస్తుండగా.. బోయపాటి శ్రీను డబ్బులు తిరిగి వచ్చేశాయనడం చెప్పడం హాట్ టాపిక్ గా మారిందని చెప్పాలి!

# ఆ రెండు సినిమాల రిజల్ట్ కోసం రామ్ వెయిటింగ్..?

ఎనర్జిటిక్ స్టార్ రామ్ రీసెంట్ గా ఆంధ్రా కింగ్ తాలూకా సినిమాతో సర్ ప్రైజ్ చేశాడు. మొన్నటిదాకా యాక్షన్ హీరోగా తన మార్క్ మాస్ సినిమాలు చేస్తూ వచ్చిన రామ్ సడెన్ గా కంటెంట్ కోసం ఒక అభిమాని రోల్ చేసి ఫ్యాన్స్ ని మెప్పించాడు. ఆంధ్రా కింగ్ తాలూకా కమర్షియల్ లెక్కలు ఎలా ఉన్నా రామ్ సినిమాలో ఆకట్టుకున్నాడు. ఐతే నెక్స్ట్ రామ్ సినిమా ఏదన్నది ఇంకా క్లారిటీ రాలేదు. రెండు సినిమాలు డిస్కషన్ స్టేజ్ లో ఉన్నాయని తెలుస్తుంది.రామ్ కాదనడంతో ఆ సినిమాలు ఐతే రామ్ ఆంధ్రా కింగ్ తాలూకా రిలీజ్ అవడానికి ముందే మరో రెండు కథలు తన దగ్గరకు వచ్చాయట కానీ రామ్ ఆ రెండిటినీ కాదన్నాడట. రీజన్స్ పర్టిక్యులర్ గా తెలియకపోయినా రామ్ కాదనడంతో ఆ సినిమాలు వేరే హీరోల దగ్గరకు వెళ్లాయి. ఆ రెండు సినిమాలు కూడా అక్కినేని బ్రదర్స్ చేస్తున్నారు. అక్కినేని హీరో నాగ చైతన్య, అఖిల్ ఇద్దరు చేస్తున్న సినిమాల కథలు రామ్ వదిలేసినవే అని టాక్. ముందుగా అఖిల్ చేస్తున్న లెనిన్ సినిమా వినరో భాగ్యము విష్ణు కథ సినిమాతో హిట్ అందుకున్న మురళి కిషోర్ ముందు లెనిన్ కథ రామ్ కి చెప్పాడట. విలేజ్ బ్యాక్ డ్రాప్ లవ్ స్టోరీ ఇంకా సినిమాలో డివోషనల్ టచ్ కూడా ఉంటుందట. ఈ సినిమాతో పాటు కార్తీక్ దండు డైరెక్షన్ లో నాగ చైతన్య చేస్తున్న థ్రిల్లర్ సినిమా కథ కూడా ముందు డైరెక్టర్ రామ్ కి చెప్పాడట. ఐతే తనకు ఇలాంటి సినిమాలు చేయడం ఇష్టం లేదని రామ్ అన్నాడట. అలా చైతన్య, అఖిల్ సినిమాలు రెండు స్టోరీస్ రామ్ నుంచి వాళ్ల దగ్గరకు వచ్చాయట. ఒక కథ ని రాసే టైంలోనే ఫలానా హీరో.. ఐతే ఆంధ్రా కింగ్ తాలూకా తర్వాత రామ్ ఎలాంటి సినిమా చేస్తాడన్నది ఇంకా క్లారిటీ రాలేదు. ఐతే రామ్ మాత్రం కాదన్న ఆ రెండు సినిమాల రిజల్ట్ కోసం ఎదురుచూస్తున్నాడట. తనకు చెప్పిన ఆ కథలు ఎలా వర్క్ అవుట్ అవుతాయో రామ్ రిజల్ట్ తెలుసుకోవాలని ఆసక్తిగా ఉన్నాడు. సాధారణంగా డైరెక్టర్స్ ఒక కథ ని రాసే టైంలోనే ఫలానా హీరో అనుకుని రాస్తారు. కొన్ని సినిమాలు రాసుకున్న హీరోలతోనే చేసే ఛాన్స్ ఉంటుంది. ఒక హీరో కాదంటే మరో హీరో ఆ సినిమా చేస్తుంటారు.



Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940**, e-mail: **sreechakratelugu@gmail.com.**